# క్రైమ్ THE మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
25-4-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 36

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
2 శనివారం 25-4-2026

# నైపుణ్యాభివృద్ధితోనే భవిష్యత్ విజయం:అడిషనల్ కలెక్టర్ పాండు



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఏప్రిల్ 24:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా, కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ పాండు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి తన జీవిత లక్ష్యాన్ని ముందుగానే స్పష్టంగా నిర్ణయించుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. ఏ రంగంలో రాణించాలనుకుంటున్నారో తెలుసుకుని, ఆ దిశగా క్రమశిక్షణతో కృషి చేస్తే విజయాన్ని సులభంగా సాధించవచ్చని సూచించారు. ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో కేవలం పాఠ్యపుస్తకాల జ్ఞానం సరిపోదని, నైపుణ్యాల అభివృద్ధి అత్యంత అవసరమని పేర్కొన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ నైపుణ్యాలు, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం వంటి అంశాలు విద్యార్థులను ముందుకు తీసుకెళ్తాయని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. విజయం ఒక్కరోజులో సాధ్యం కాదని, నిరంతర శ్రమ, పట్టుదల, క్రమశిక్షణతో ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని స్పష్టం చేశారు. వైఫల్యాలను భయపడకుండా వాటిని పాఠాలుగా తీసుకుని ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. సామాజిక నేపథ్యాన్ని అడ్డంకిగా కాకుండా అవకాశంగా మలుచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవడం విజయానికి తొలి అడుగని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ అకిలేష్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి రామాచారి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీష్, ఆర్‌సెట్ డైరెక్టర్ రాజేశ్ కుమార్, ట్రైనర్ అరవింద, స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనర్ కె. కృష్ణ కుమార్, మోటివేటర్ కూన వేణు, రాజు రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలోని డిగ్రీ విద్యార్థులు, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పై టి ఆర్ పి రంగారెడ్డి జిల్లా నాయకుల ఆందోళన మియాపూర్ డిపో వద్ద ధర్నా..

శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ : ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టి ఆర్ పి) రంగారెడ్డి జిల్లా నాయకులు మియాపూర్ బస్ డిపో 1 & 2 వద్ద భారీగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింగ్ ముదిరాజ్ మాట్లాడుతూ, శంకర్ గౌడ్ మృతి అత్యంత దురదృష్టకరమని, ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల భద్రత, సంక్షేమంపై ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. అలాగే బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు టి ఆర్ పి పార్టీ పోరాడి అండ గా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు బండారు విజయలక్ష్మి, ఉపాధ్యక్షులు పొనుగోటి సందీప్, శాగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న చిర్రా రవీందర్ యాదవ్..

## శ్రీవారి సేవలో పాల్గొని ప్రత్యేక మొక్కులు చెల్లింపు.



**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :** తిరుమల శ్రీవారిని భారాస సీనియర్ నాయకులు, శేరిలింగంపల్లి ఉద్యమ నేత చిర్రా రవీందర్ యాదవ్ దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ దర్శనంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవారి సేవలో పాల్గొన్నారు. అనంతరం స్వామి తీర్థ ప్రసాదాలను వేద పండితులు చిర్రా రవీందర్ యాదవ్ కు అందజేశారు. ఈ సందర్భంగా చిర్రా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణలో రాబోయేది భారాస ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. జగిత్యాల సభతో కాంగ్రెస్ ఓటమి మొదలైందన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలే చిత్తు చిత్తుగా ఓడించే పరిస్థితులు ముందు ముందు ఉన్నాయన్నారు. భారాస అధినేత కేసీఆర్ ను మరోసారి ప్రజలు సీఎంగా చూడాలని కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. అలాగే హైదరాబాద్ ను అభివృద్ధి చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి విఫలం అయ్యారని మండిపడ్డారు. భాగ్యనగరం ప్రతిష్టతను దిగజార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ చేసిన అభివృద్ధే చిరస్థాయిగా నిలుస్తుందని, ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని చిర్రా రవీందర్ యాదవ్ పేర్కొన్నారు.

# కూకట్ పల్లి బస్టాప్ వద్ద గుర్తుతెలియని మృతదేహం లభ్యం



**కూకట్ పల్లి, ఏప్రిల్ 24 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి మెయిన్ రోడ్డు లోని బస్ స్టాప్ వద్ద గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన సంఘటన కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత రెండు రోజుల నుండి కూకట్ పల్లి బస్టాప్ లో ఉంటున్నాడని, శుక్రవారం మధ్యాహ్నం దాదాపు 12 గంటల సమయంలో కూర్చున్న చోటే ముందుకు పడిపోవడం స్థానికులు గమనించి 108కి సమాచారం అందించారు. 108 సిబ్బంది వచ్చి పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గుర్తు తెలియని మృతదేహంగా భావించి దాదాపు అతని వయస్సు 40 నుంచి 45 వరకు ఉండొచ్చని పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఎండలోనూ అడ్మిషన్ల కోసం ఉపాధ్యాయుని మైక్ ప్రచారం

## వేసవి సెలవుల్లో కూడా అడ్మిషన్ల కై అలుపెరుగని పోరాటం



**నూతనకల్ (క్రైమ్ మిర్రర్):** ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ఉపాధ్యాయులు వినూత్న చర్యలు చేపడుతున్నారు. మండలంలోని ఎర్రపహాడ్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సామ సవేందర్ రెడ్డి తీవ్ర ఎండను లెక్కచేయకుండా మైక్ ద్వారా ప్రచారం నిర్వహిస్తూ ప్రజలను ఆకట్టుకుంటున్నారు. శుక్రవారం ఎర్రపహాడ్,మిర్యాల గ్రామాల వీధుల్లో తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలు, నాణ్యమైన బోధన, ఉచిత పుస్తకాలు, యూనిఫార్ములు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను వివరించారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా టీచర్ సామ సవేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. అన్ని సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా అందుబాటులో ఉన్నాయని వివరించారు. పాఠశాలలో చేరిన ప్రతి విద్యార్థికి తరగతికి తగిన సామర్థ్యాలు అందిస్తామని అన్నారు. పాఠశాలలో చేరిన విద్యార్థులకు గురుకుల నవోదయ పోటీ పరీక్షలకు శిక్షణ ఉంటుందని తెలిపారు. వేసవి సెలవుల్లో మండుటెండలో ఉపాధ్యాయుని సేవా భావాన్ని పలువురు అభినందించారు. ఎండలోనూ గ్రామ గ్రామానికి తిరుగుతూ విద్యపై అవగాహన కల్పించడం అభినందనీయం అని తల్లి తండ్రులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరగాలని ఆశాభావం వ్యక్తమవుతోంది.

# పటాన్‌చెరులో ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై సమీక్ష సమావేశం

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఏప్రిల్ 24:** ప్రత్యేక సవరణ కార్యక్రమం లో భాగంగా పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన సహాయ ఎన్నికల నమోదు అధికారులు, బీఎల్‌ఓ సూపర్వైజర్లు, బీఎల్‌ఓలతో సమీక్షా సమావేశం పటాన్‌చెరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర అడిషనల్ సీఈఓ వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2025 ఓటరు జాబితాలోని అర్హులైన ఓటర్లందరినీ 2002 ఓటరు జాబితాతో అనుసంధానం చేయాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో మ్యాపింగ్ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని పేర్కొంటూ, బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించి వారం రోజుల్లో మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే, మ్యాపింగ్ ప్రక్రియలో భాగంగా రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్‌ఏల సహకారం తీసుకోవాలని, రెసిడెన్షియల్ కాలనీలలో సమావేశాలు నిర్వహించి ప్రతి ఓటరు మ్యాపింగ్ అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఓటర్లందరూ సహకరించి ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఈఆర్‌వో అండ్ జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి అంబదాస్ రాజేశ్వర్, డిప్యూటీ కమిషనర్లు, తహసీల్దారులు, మున్సిపల్ కమిషనర్లు, బీఎల్‌ఓ సూపర్వైజర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.



# కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి డైరెక్టర్ కె వెంకటేశ్వర్లుకి వినతి పత్రం

**మందమర్రి టౌన్ ఏప్రిల్ 24 క్రైమ్ మిర్రర్:** సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల అలాగే కన్వెన్షన్ డ్రైవర్ల సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని శుక్రవారం మందమర్రిలో పర్యటించిన సింగరేణి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ కె.వెంకటేశ్వర్లు కొత్తగూడెం అధికారికి సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో మెమొరాడం అందజేశారు. సానుకూలంగా స్పందించిన డైరెక్టర్ అధికారులతో చర్చించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అనంతరం దూలం శ్రీనివాస్ ఎస్సీ కేఎస్ సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ మందమర్రి డివిజన్ పరిధిలో గత 12 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఎస్ అండ్ పిసి ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల టెండర్ గడువు మూగిసి, 2 నెలలుగా కొత్త టెండర్ రాకపోవడంతో 213 మంది ఒక్కసారిగా రోడ్డున పడ్డారని అన్నారు. దీనిపైన స్పందించి వెంటనే కొత్త టెండర్ వచ్చే విధంగా, కార్మికులందరినీ ఎలాంటి నిబంధనలు లేకుండా, 126 పోస్టులకు 213 మందిని తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలోని ఎస్ఆర్పి ఓసిపిలో కన్వేయన్స్ డ్రైవర్ల దుస్థితి మరి దయనింగా ఉందని, ఓనర్ల పెత్తనం తీవ్ర స్థాయిలో ఉన్నాయని, డ్రైవర్లను ఎలాంటి కారణాలు లేకుండా తొలగిస్తూ, తప్పుడు బిల్లులు పెడుతూ సింగరేణి సంస్థను మోసం చేస్తున్న విషయాలపై పూర్తి స్థాయి ఆధారాలతో కూడిన మెమారాండం డైరెక్టర్ పి పి కి ఇవ్వడం జరిగింది. దీనిపైన స్పందించిన డైరెక్టర్ సంబంధిత అధికారులతో చర్చించి, తగిన న్యాయం చేసే విధంగా వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు తదితరులు పాల్గొన్నారు.



# బీహెచ్ఈఎల్ డిపోలో టీజీఎస్ఆర్టీసీ జేఏసీ నూతన కమిటీ ఏర్పాటు



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఏప్రిల్ 24::** టీజీఎస్ఆర్టీసీ బీహెచ్ఈఎల్ డిపోలో కార్మికుల హక్కుల సాధన, సమ్మె ఉద్యమాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా జాయింట్ యాక్షన్ కమిటీ నూతన కార్యవర్గాన్ని కార్మికులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీలో కన్వీనర్‌గా బలరాముడు నియమితులయ్యారు. కో-కన్వీనర్లుగా అశోకు, సంగయ్య, మహేందర్, బి.ఎం. రెడ్డి, హరిబాబు, శ్రీనివాస్‌లను ఎంపిక చేశారు. అడ్వైజర్లుగా బి.వై. రెడ్డి, ఎల్. రుక్కయ్య, వీఎన్‌కే రెడ్డి, సజావుద్దీన్ బాధ్యతలు స్వీకరించారు. కో-ఆర్డినేటర్లుగా హిర్యనాయక్, సుబ్రహ్మణ్యం, సుబ్బారావు, నవీన్ కుమార్‌లను, కోశాధికారులుగా ఏ. నవీన్ కుమార్, సుబ్బారావును నియమించారు. ఆర్గనైజర్లుగా మల్లేష్, ఎస్.కె. రెడ్డి, స్వామి, వినయ్ కుమార్, కోటయ్యలను ఎంపిక చేశారు. యాక్టివ్ మెంబర్లుగా పి. వెంకటేష్, కరీంలు కొనసాగనున్నారు. ఈ సందర్భంగా కార్మిక సోదరులు మాట్లాడుతూ... నూతన జేఏసీ కమిటీకి సంపూర్ణ సహకారం అందించి, తమ న్యాయమైన 32 డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సమ్మెను విజయవంతం చేసేందుకు అందరూ కలిసి

# క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
25-4-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 36

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## మల్లారెడ్డి పక్కా స్కెచ్!

బిజెపిలో చేరిక విషయంలో వ్యూహాత్మకంగా..

గులాబీ పార్టీ పై గౌరవం ఉందని ప్రకటించిన ప్రీతి రెడ్డి

4లో



## బెంగాల్‌లో జంగిల్ రాజ్ ఖేల్ ఖతం

భారీ ఓటింగ్ బిజెపి అధికారానికి సూచిక

టిఎంసి పూర్తి మహిళా వ్యతిరేక పార్టీ

ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు



# నేడు రోడ్డెక్కనున్న బస్సులు!

ప్రభుత్వంతో ఆర్టీసీ జేఏసీ నేతల చర్చలు సఫలం!

కార్మికుల పలు డిమాండ్లకు సర్కార్ అంగీకారం

ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంపై హైలెవల్ కమిటీ

కార్మికుల గుర్తింపు సంఘం ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్

తక్షణమే ఒకటి లేదా రెండు డీఏల చెల్లింపునకు ఓకే

మూడు రోజులుగా డిపోలకే పరిమితమైన తెలంగాణ ఆర్టీసీ బస్సులు మళ్లీ రోడ్డెక్కనున్నాయి. తెలంగాణ ప్రభుత్వం, ఆర్టీసీ జేఏసీ నేతల మధ్య చర్చలు సఫలం అయినట్లు, సమ్మె చేపట్టిన కార్మికుల డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం అంగీకరించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా కార్మికుల గుర్తింపు సంఘం ఎన్నికలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.

## ఆర్టీసీలో ఆత్మ బలిదానం!

- డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య
- ఆర్టీసీ కార్మికుల్లో ఆగ్రహావేశాలు
- వెనువెంటనే స్పందించిన ప్రభుత్వం
- నలుగురు అధికారులకు చర్చల బాధ్యతలు

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె తీవ్రతరం అవుతోంది. గత మూడు రోజులుగా సమ్మె చేపడుతున్న ఆర్టీసీ కార్మికులు

- మిగతా 4వ పేజీలో



## తెలంగాణలో మరో కొత్త పార్టీ

నేడు పార్టీపేరును ప్రకటించనున్న కవిత

కార్యకర్తల సమక్షంలో జెండా, ఎజెండా వెల్లడి

తెలంగాణ ప్రజా జాగృతి అంటూ ప్రచారం

**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** తెలంగాణలో మరో కొత్త పార్టీ పురుడుపోసుకుంటుంది. శనివారం కవిత కొత్త పార్టీ ప్రకటించబోతున్నారు. పార్టీ పేరు ప్రకటన విడుదల కాబోతున్నది. శనివరాం ఉదయం 10 గంటలకు.. కవిత తన పార్టీ పేరును ప్రకటించబోతున్నారు. జెండా, ఎజెండా విడుదల చేయబోతున్నారు.

- మిగతా 4వ పేజీలో



## చంద్రబాబు సాయం కోసం కేసీఆర్!



బిజెపితో పొత్తు కోసం ప్రయత్నం

టిడిపి అధినేత పై బాధ్యతను పెట్టిన కేంద్ర పెద్దలు

**క్రైమ్ మిర్రర్, జనరల్ డెస్క్:** బిజెపితో పొత్తుకు కేసిఆర్ ప్రయత్నిస్తున్నారా? ఎలాగైనా బిజెపితో కలవాలని చూస్తున్నారా? లేకుంటే రేవంత్ రెడ్డి గులాబీ పార్టీని కబలించడం ఖాయమా? అందుకే ఆయన ఆందోళనతో ఉన్నారా? బిజెపి కోసం చంద్రబాబుకు రాయబారం పంపారా? అంటే అవుననే

- మిగతా 4వ పేజీలో




## కేజ్రీవాల్‌కు బీజేపీ షాక్



- ఆప్ ను వీడిన ముగ్గురు రాజ్యసభ ఎంపీలు
- నితీన్ నబీన్ సమక్షంలో కమలం పార్టీలో చేరిక
- మరో నలుగురూ వీడుతున్నారన్న రాఘవ్ చద్దా
- రాజ్యసభాపక్షం బీజేపీలో విలీనమైనట్లు ప్రకటన
- పంజాబ్ లో పాగా వేసేందుకు కమలం వ్యూహం

**క్రైమ్ మిర్రర్, జనరల్ డెస్క్:**దేశ రాజకీయాల్లో శుక్రవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్రంలోని అధికార బీజేపీ.. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి ఊహించని షాక్ ఇచ్చింది.

4లో



## గొడ్డలి పార్టీతో జాగ్రత్త సుమీ

- కిల్లర్ పార్టీ నేతలు కొత్త ఎత్తుగడలు
- వారి వ్యూహాలకు తగ్గట్లుగా ఉండాల్సిందే
- ఎంతటి దారుణాలకైనా తెగించేస్తున్నారు
- క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో పార్టీ అధినేత చంద్రబాబు

5లో

## మద్యం కుంభకోణంలో కొత్త కోణం!

- ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ ఎంట్రీ
- ఏకకాలంలో విస్తృత సోదాలు
- విజయసాయిరెడ్డి ఇంట్లో సైతం
- చెవిరెడ్డి ఇంటికి తాళం



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో మద్యం కుంభకోణం పై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది ఈడి . సంచలనం సృష్టించిన లిక్కర్ స్కామ్ కేసులో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ తన విచారణను మరింత వేగవంతం చేసింది. ఈ కుంభకోణంలో కీలక పాత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కసిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి, ప్రభుత్వ మాజీ సలహాదారు కృష్ణమోహన్ రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి ధనుంజయ రెడ్డి తో పాటు ఇతర నిందితుల నివాసాలు, కార్యాలయాల్లో

4లో



## పారిశ్రామికవేత్తల ఆమోదంతోనే హిల్ట్ పాలసీ

పరిశ్రమలను ఓఆర్ఆర్‌కు అవతల తరలించే ప్రతిపాదన

నగరంలో కాలుష్యరహిత వాతావరణం కోసం కృషి

చైనా తరహాలో ఇండస్ట్రియల్ బ్లాక్ అభివృద్ధి

భూములు ధరలను పెంచడానికి నిర్ణయం

కేబినెట్ సబ్‌కిటీ భేటిలో డిప్యూటీ సిఎం భట్టి

# తెలంగాణలో మరో కొత్త పార్టీ

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు కాబోతున్నది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, కామ్రేడ్ పార్టీలకు ధీటుగా పోరాటానికి సిద్ధం అవుతున్న కవిత పార్టీ ప్రకటన ఎలా ఉండబోతుంది అనేది ఉత్కంఠ రేపుతోంది. కవిత పార్టీకి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ అద్వయ కన్వెన్షన్ సెంటర్ వేదికగా బహిరంగ సభలో కవిత తన పార్టీ పేరును ప్రకటించబోతున్నారు. ఈ సభకు సుమారు 30 వేల మంది జన సమీకరణ చేస్తున్నట్లు జాగృతి శ్రేణులు తెలిపారు .మేడ్చల్ సభలోనే కవిత పార్టీ పేరు జెండా, ఎజెండాను ప్రకటించనున్నారు. కవిత పార్టీ పేరు 'తెలంగాణ ప్రజా జాగృతి', 'తెలంగాణ ప్రజా వికాస సమితి' అంటూ జోరుగా ప్రాచారం సాగుతోంది. ఈమేరకు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. గన్ పార్క్ లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులతో కవిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. తెలంగాణ జాగృతి పేరుతోనే ఇప్పటికే చేరికలు ప్రారంభమయ్యాయి. బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాబురావు, పలువురు కార్యకర్తలు కవిత సమక్షంలో పార్టీలో చేరారు. జాగృతి జనం బాట కార్యక్రమంతో పార్టీకి సంబంధించిన గ్రౌండ్ వర్క్‌ను ఆమె పూర్తి చేశారు. అటు అధికార పార్టీ కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ పార్టీ నీ ,మరోవైపు బిజెపిని టార్గెట్ చేస్తూ కామెంట్స్ చేస్తున్నారు కవిత. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు కవిత. కవిత పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు నాంది పలకనున్నారు. ఇంటిపార్టీతో బంధం తెంచుకున్న ఆమె తెలంగాణ రాజకీయాల్లో కొత్త జెండా పాతబోతున్నారు. తనకున్న పరిచయాలు, వాక్చాతుర్యంతో ఆమె ముందుకు నడవాలని చూస్తున్నారు. ప్రధానంగా మహిళలను, ఎస్సీ, బిసి వర్గాలను అక్కున చేర్చుకోవడం ద్వారా పార్టీని బలోపేతం చేసేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

# మల్లారెడ్డి పక్కా స్కెచ్!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** మల్లారెడ్డి బిజెపిలో చేరుతారా? అయితే ఎప్పుడు చేరుతారు? ఆయన నేరుగా చేరుతారా? లేకుంటే కోడలు ప్రీతి రెడ్డిని ముందుగా పంపిస్తారా? తెలంగాణ పొలిటికల్ సర్కిల్లో దీనిపైనే చర్చ నడుస్తోంది. ఇటీవల మల్లారెడ్డి తన కోడలితో కలిసి ప్రధాని నరేంద్ర మోడీని కలిసిన సంగతి తెలిసిందే. అప్పటినుంచి మల్లారెడ్డి ఫ్యామిలీ బీజేపీలో ఎంట్రీ పై రకరకాల చర్చ నడుస్తోంది. అయితే బిజెపిలో చేరికను ఖండించలేరు కానీ.. గులాబీ పార్టీ పై గౌరవం ఉందంటూ చెప్పడం ద్వారా ఈ ప్రచారానికి చెక్ పెట్టారు మల్లారెడ్డి. కానీ ఆ ఫ్యామిలీ ఎప్పటికైనా బిజెపి గూటికి చేరడం ఖాయమని తెలంగాణలోని పొలిటికల్ విశ్లేషకులు కుండబద్దలు కొడుతున్నారు.

**ప్రధానిని కలిసాక కూడా..**

ఎప్పుడైతే ప్రధాని నరేంద్ర మోడీని ప్రత్యేకంగా కలిశారో అప్పుడే మల్లారెడ్డి ఫ్యామిలీ కాషాయ గూటికి చేరడం ఖాయం అని తేలిపోయింది. అయితే బిజెపిలో చేరుతానన్న ప్రచారానికి తెలివిగా చెప్పి పెట్టారు మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి. బిజెపి కార్యాలయానికి వెళ్లి మరి చర్చలు జరిపారు. కానీ ఇప్పుడు బీజేపీలో చేరడం లేదని చెప్పడం ద్వారా తన తెలివితేటలను ప్రదర్శించారు. నిజానికి ఆమె ఏ పార్టీలోనూ లేరు. అసలు రాజకీయాల్లోనే లేరు. కానీ మల్లారెడ్డి మాత్రం మాజీ మంత్రి. గులాబీ పార్టీ ఎమ్మెల్యే. ఒకవైపు ఆ పార్టీకి దూరంగా ఉంటూనే.. చాలా గౌరవం ప్రదర్శిస్తూ వచ్చారు కెసిఆర్ పట్ల. మరోసారి రాజకీయాల నుంచి రిటైర్మెంట్ తీసుకుంటున్నానని కూడా చెప్పుకొచ్చారు. కానీ దేనిపై కూడా ఫుల్ క్లారిటీ లేదు. ఇప్పుడు బిజెపి అగ్ర నాయకత్వాన్ని కలిసి బిజెపిలో చేరడం లేదని చెప్పడం ద్వారా తన తెలివితేటలను ప్రదర్శించారు మల్లారెడ్డి..

**ఎంపీ అభ్యర్థిగా కోడలు..**



వచ్చే ఎన్నికల్లో మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి బిజెపి తరఫున ఎంపీగా బరిలో దిగడం ఖాయం. రాజకీయ వర్గాల్లో కూడా దీనిపై క్లారిటీ ఉంది. అయితే బిజెపి అగ్రనేతలతో చర్చలు జరిపి.. పార్టీ చేరికకు సంబంధించి ఇంకా ముహూర్తం ఖరారు చేయకపోవడం చూస్తుంటే తెరవెనుక వ్యూహం ఉన్నట్లు అర్థమవుతోంది. తన కోడలు ప్రీతి రెడ్డితో మల్లారెడ్డి మాట్లాడిస్తున్నారు. ఆమె గులాబీ పార్టీ నాయకత్వం పై గౌరవం అన్న పదాన్ని వాడుతూనే ఆ పార్టీలో కొనసాగుతామని మాత్రం ప్రత్యేకంగా చెప్పడం లేదు. ఇప్పటికే మల్లారెడ్డి ఫ్యామిలీ ఒక స్ట్రాంగ్ డిసిషన్ తీసుకుంది. ప్రీతి రెడ్డి ద్వారా బిజెపి తో తమ ప్రయాణం అని ఆ ఫ్యామిలీ క్లారిటీ ఇచ్చింది. అయితే గులాబీ పార్టీ ఎమ్మెల్యేగా మల్లారెడ్డి కొనసాగుతున్న నేపథ్యంలో.. చాలా తెలివిగా వ్యవహరిస్తోంది ఆ ఫ్యామిలీ. ఇప్పటికిప్పుడు బిజెపిలో కలవకపోయినా ఆ పార్టీ మల్లారెడ్డి ఫ్యామిలీని మాత్రం ఓన్ చేసుకునే పనిలో పడింది. తద్వారా మూడు కోణాల్లో రాజకీయం చేశారు మల్లారెడ్డి. ఒకటి కాంగ్రెస్ ప్రభుత్వం తన జోలికి రాకపోవడం, గులాబీ పార్టీ సాఫ్ట్ కార్నర్ తో ఉండడం, భవిష్యత్తులో బిజెపి ఆప్షన్ ఉంచేలా చేసుకోవడం వంటివి పగడ్బందీగా ప్రణాళిక వేసి అమలు చేస్తున్నారు మల్లారెడ్డి. తెలంగాణలో బిజెపి మిషన్ ప్రారంభించాక మల్లారెడ్డి ఫ్యామిలీ తమ మార్కు రాజకీయాన్ని ప్రారంభిస్తుందన్న మాట.

# ఆర్టీసీలో ఆత్మ బలిదానం!




మరింత దూకుడుగా ముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు. ఎక్కడికక్కడే బస్సులను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో వరంగల్ జిల్లా నర్సంపేట బస్సు డిపోకు చెందిన డ్రైవర్ కోలా శంకర్ గౌడ్ ఆత్మాహుతికి ప్రయత్నించారు. పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నారు. 90 శాతం కాలిన గాయాలతో ఆయన ప్రాణాలతో పోరాడుతున్నాడు. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే బలిదానాలకు సిద్ధం అని ఆర్టీసీ కార్మికులు సంకేతాలు పంపడం సంచలనంగా మారింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శంకర్ గౌడ్ ప్రాణాలు వదలడంతో ఆర్టీసీ ఉద్యమం మరో స్థాయికి చేరే ఛాన్స్ కనిపిస్తోంది.

**యూనియన్ నేతలతో చర్చలు..**

ఆర్టీసీ డ్రైవర్ ఆత్మబలిదానంతో ఆర్టీసీ కార్మికులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు ప్రభుత్వంపై. మరోవైపు ప్రభుత్వ వర్గాల్లో సైతం ఆందోళన వ్యక్తం అవుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించింది. కార్మికుల డిమాండ్ల పరిష్కారం పై ఐఏఎస్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కార్మికులతో చర్చలు కూడా జరుగుతున్నాయి. సీనియర్ ఐఏఎస్ అధికారులు వికాస్ రాజ్, దాన కిషోర్, సందీప్ సుల్తానియా, ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి ప్రభుత్వం తరఫున ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలతో చర్చలు జరుపుతున్నారు. ఆత్మ బలిదానం చేసిన శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఆర్టీసీ కార్మిక యూనియన్లు చేసిన విన్నపాలను విన్న అధికారుల బృందం ప్రభుత్వానికి నివేదిస్తామని.. తప్పకుండా పరిష్కార మార్గం చూపిస్తామని హామీ ఇచ్చారు. అయితే కార్మికుడి ఆత్మ బలిదానంతో ప్రభుత్వ వర్గాల్లో కూడా ఒక్కసారిగా ఆందోళన ప్రారంభం అయింది. ఆర్టీసీ కార్మికుల సమ్మె ఎటువైపునకు దారితీస్తుందో అన్న ఆందోళన ప్రభుత్వ వర్గాల్లో ఉంది.

**కార్మికులకు బాసటగా ప్రతిపక్షాలు..**

మరోవైపు ఆర్టీసీ కార్మికుడు ఆత్మహత్యతో రాజకీయ పార్టీలు రంగంలోకి దిగాయి. ప్రతిపక్ష పార్టీలు కార్మికులకు బాసటగా నిలుస్తున్నాయి. బిజెపి కేంద్రమంత్రి బండి సంజయ్, రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆర్టీసీ కార్మికుల ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలనే కాంగ్రెస్ సర్కార్ కొనసాగిస్తుందని మండిపడ్డారు. మరోవైపు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. ప్రతిపక్షాల ట్రాప్ లో పడవద్దని ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మరో మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఈ ఘటనపై స్పందించారు. డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మబలిదానంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కార్మికులు సహనంతో వ్యవహరించాలని కోరారు.

# చంద్రబాబు సాయం కోసం కేసీఆర్!

(మొదటి పేజీ తరువాయి)

సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి.

**ఎప్పటినుంచో విభేదాలు..**

చంద్రబాబుతో కేసీఆర్ విభేదాలు ఇప్పటివి కావు. తనకు మంత్రి పదవి ఇవ్వలేదన్న ఆవేశంతో, ఆవేదనతో టిడిపికి గుడ్ బై చెప్పారు కెసిఆర్. నాటి నుంచి చంద్రబాబును టార్గెట్ చేసుకుంటూ వచ్చారు. మధ్యలో వైయస్ రాజశేఖర్ రెడ్డి పై కూడా పోరాటం చేశారు. ఆయన అకాల మరణంతో తిరిగి చంద్రబాబుపై ఫోకస్ పెట్టారు. తెలంగాణ సమాజానికి చంద్రబాబును విలన్ గా చూపించి రాజకీయ పునాది వేసుకున్నారు కేసీఆర్. అలా రెండుసార్లు తెలంగాణలో అధికారంలోకి రాగలిగారు. ఏపీలో చంద్రబాబు ప్రత్యర్థి జగన్మోహన్ రెడ్డితో కలిసి ఆయనకు ఇబ్బంది పెట్టారు. ఇప్పటికీ చంద్రబాబు విషయంలో అదే భావనతో వ్యవహరిస్తూ వచ్చారు కేసీఆర్.

**రాజకీయ ఇబ్బందుల్లో..**

ప్రస్తుతం తెలంగాణలో అత్యంత క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నారు కేసీఆర్. తెలంగాణ ప్రజల నమ్మకాన్ని కోల్పోయారు. రాజకీయంగా కవిత విభేదించి బయటకు వెళ్లిపోయారు. మరోవైపు హరీష్ రావు విషయంలో సైతం అనేక రకాల అనుమానాలు ఉన్నాయి. మరో కుటుంబ సభ్యుడు సంతోష్ రావు ఎక్కడ ఉన్నారో కూడా తెలియడం లేదు. కేటీఆర్ వ్యవహార శైలిలో సైతం మార్పు వస్తోంది. పైగా కుటుంబ పార్టీగా.. అవినీతి పార్టీగా గులాబీ పార్టీపై ఒక ముద్ర వేశారు. అయితే కెసిఆర్ కు జైలు అవసరం లేదు. ఇప్పటికే ఫామ్ హౌస్ రూపంలో జైలులో పెట్టాను అన్న రీతిలో రేవంత్ ఉన్నారు. ఈ పరిణామాల క్రమంలో వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవడం ఖాయం. అందుకే కేసిఆర్ బిజెపి కోసం చేయని ప్రయత్నం అంటూ లేదు. కానీ అటువైపు నుంచి అనుకున్నంత స్థాయిలో సానుకూలత రావడం లేదు. దీంతో కెసిఆర్ పునరాలోచనలో పడ్డారు.

**పాత వైరం మరిచి..**

రాజకీయాల్లో శాశ్వత మిత్రుడు, శాశ్వత శత్రువు ఉండరంటారు. ఈ ఫార్ములాను అనుసరించి ఇప్పుడు కెసిఆర్ చంద్రబాబు సాయం కోరుతున్నట్లు తెలుస్తోంది. బిజెపి సైతం కేసీఆర్ విషయంలో చంద్రబాబు సాయం, సలహా కోరుతున్నట్లు సమాచారం. కెసిఆర్ తో పొత్తు విషయంలో బిజెపి అనుసరించాల్సిన వ్యూహం బాధ్యతను చంద్రబాబుకు అప్పగించినట్లు తెలుస్తోంది. సో ప్రస్తుత పరిస్థితుల్లో కెసిఆర్ కు చంద్రబాబు ఏకైక దిక్కు అని స్పష్టమవుతోంది. అయితే ఇన్నాళ్ళు ఇబ్బంది పెట్టిన కేసీఆర్ విషయంలో చంద్రబాబు ఎలా స్పందిస్తారు అనేది చూడాలి.

# నేడు రోడ్డెక్కనున్న బస్సులు!

అంతేకాకుండా.. తక్షణమే ఒకటి లేదా రెండు డీఏల చెల్లింపునకు ఓకే చెప్పింది ప్రభుత్వం. మరోవైపు ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంపై హైలెవల్ కమిటీని నియమించే అవకాశం ఉంది. ప్రభుత్వం, ఆర్టీసీ జేఏసీ నేతల మధ్య చర్చలు 12 గంటల పాటు కొనసాగాయి. మంత్రుల కమిటీ, జేఏసీ నేతల మధ్య 32 డిమాండ్లపై చర్చలు జరిగాయి. ప్రభుత్వం, ఆర్టీసీ జేఏసీ చర్చల్లో దశాబ్దాల విలీన సమస్యకు పరిష్కారం లభించినట్లు తెలుస్తోంది. సెక్రటేరియట్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్ ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కాగా, డ్రైవర్ శంకర్ గౌడ్ మృతికి సంతాపం తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మాట్లాడుతూ. 'బడ్జెట్ సమావేశాలు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), మహిళా బిల్లు, ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి, నేను, ఇతర మంత్రులు బిజీగా ఉన్న సమయంలో అకస్మాత్తుగా సమ్మె నిర్ణయం తీసుకోవడంతో ఒక కార్మికుడిని కోల్పోవాల్సి వచ్చింది. ఇది అత్యంత బాధాకరం, ఆ కుటుంబానికి ఇది తీరని లోటు' అని అన్నారు. ఆర్టీసీ అందరి సంస్థ అని.. దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు.

## బెంగాల్‌లో జగిల్ రాజ్ ఖేల్ ఖతం

కోల్‌కతా,ఏప్రిల్24: పశ్చిమ బెంగాల్‌లో నమోదైన భారీ పోలింగ్.. రాష్ట్రంలో మమత ఆధ్వర్యంలోని టీఎంసీ జంగిల్ రాజ్ పాలనకు అంతం అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. బెంగాల్‌లోని డుమ్ డుమ్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ ప్రచార సభలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి టీఎంసీ ప్రభుత్వంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో గురువారం జరిగిన తొలి దశ ఓటింగ్‌లో భారీ స్థాయిలో పోలింగ్ నమోదైన సంగతి తెలిసిందే. ఈ అంశంపై కూడా మోదీ మాట్లాడారు. తొలి దశ ఎన్నికల్లో రికార్డ్ స్థాయిలో పోలింగ్ నమోదైందంటే అది టీఎంసీ మహా జంగిల్ రాజ్ ప్రభుత్వానికి అంతం మొదలైనట్లే. రాష్ట్రంలో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది. బీజేపీకి అండగా నిలుస్తున్న మహిళా ఓటర్లకు ధన్యవాదాలు. గురువారం నాడు బీజేపీకి లభించిన మద్దతు పార్టీ విజయ శంఖారావం పూరించినట్లే. బెంగాల్‌లో ఎక్కడ ప్రజాస్వామ్యాన్ని తన నిరంకుశత్వంతో టీఎంసీ అంతం చేసిందో, అక్కడే, మొదటి దశలోనే ప్రజలు ప్రజాస్వామ్య దేవాలయాన్ని నిర్మించడం ప్రారంభించారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఆయుష్మాన్ భారత్ యోజన పథకాన్ని వర్తింపజేస్తాం. అర్హులైన వారికి ఐదు లక్షల వైద్యం అందిస్తాం. ప్రభుత్వం ఏర్పడ్డ తొలి క్యాబినెట్ మీటింగ్‌లోనే దీనిపై నిర్ణయం తీసుకుంటాం. టీఎంసీ మహిళా వ్యతిరేక పార్టీ. మహిళలు అభివృద్ధి చెందాలని టీఎంసీ కోరుకోవడం లేదు. మహిళల భద్రతే బీజేపీ మొదటి ప్రాధాన్యం. బెంగాల్ ఆడబిడ్డలు అత్యాచారానికి గురై న్యాయం కావాలని కోరితే.. ఆడబిడ్డలు బయటకు రాకూడదని టీఎంసీ ప్రభుత్వం చెబుతోంది. మహిళలు కలలు కనడాన్ని టీఎంసీ అంగీకరించదని వ్యాఖ్యానించారు. ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో హత్యాచారానికి గురైన బాధిత యువతి తల్లి రత్న దేవ్‌నాథ్‌ను ప్రధాని మోదీ కలిశారు. ఆమెను బీజేపీ ఈ ఎన్నికల్లో తన పార్టీ తరఫున పానిహటి నుంచి బరిలోకి దింపింది. ఈ అంశంపై మోదీ స్పందించారు. రత్న దేవ్‌నాథ్.. తన కూతురును కష్టపడి డాక్టర్ చేసింది.

# కేజ్రీవాల్‌కు బీజేపీ షాక్

(మొదటి పేజీ తరువాయి)

ఆ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యులకు గాలం వేసింది. కేజ్రీవాల్ పట్ల అసంతృప్తితో ఉన్న రాఘవ్ చద్దా సహా అశోక్ మిట్టల్, సందీప్ పాఠక్ ముగ్గురూ బీజేపీలో చేరారు. మరో నలుగురు రాజ్యసభ సభ్యులు హర్భజన్ సింగ్, రాజేంద్ర గుప్తా, స్వాతి మలివాల్, విక్రమ్ సింగ్ సాహ్ని కూడా అదే బాటలో ఉన్నారు. స్వాతి మలివాల్ ఇప్పటికే తాను ఆప్ ను వీడుతున్నట్లు ప్రకటించారు. రాఘవ్ చద్దా శుక్రవారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితీన్ నబీన్ ను కలిసి ఆ పార్టీలో చేశారు. ఆప్ కు మొత్తం పది మంది రాజ్యసభ ఎంపీలున్నట్లు, వీరిలో ఏడుగురం పార్టీని వీడినందున తమ రాజ్యసభాపక్షాన్ని బీజేపీలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు. ఇక ఆప్ కు మరో ముగ్గురు ఎంపీలు మాత్రమే ఇప్పుడు రాజ్యసభలో ఉన్నారు. రాఘవ్ చద్దా సహా ఆప్ ఎంపీలు పార్టీని వీడటంపై ఆప్ అధినేత, మాజీ సీఎం కేజ్రీవాల్ స్పందించారు. పంజాబ్ ప్రజలకు బీజేపీ మరోసారి వెన్నుపోటు పొడిచిందని ఆయన వ్యాఖ్యానించారు. సోషల్ మీడియా వేదికగా కేజ్రీవాల్ ఈ ప్రకటన చేశారు. మరోవైపు పార్టీ నుంచి నేతలు వెళ్లిపోయినప్పటికీ.. ఆప్ ఎప్పుడూ ఐక్యంగానే ఉంటుందని పంజాబ్ సీఎం భగవంత్ సింగ్ మాన్ అన్నారు. ఆప్ మరో ఎంపీ సంజయ్ సింగ్ కూడా ఈ అంశంపై మాట్లాడారు. “రాఘవ్ చద్దాకు పార్టీ అన్నీ ఇచ్చింది. ఎంపీ, ఎమ్మెల్యేను చేసింది. సందీప్ పాఠక్‌ను పంజాబ్ ప్రజలు ప్రేమతో రాజ్యసభకు పంపారు. దిగువస్థాయి నుంచి వచ్చిన రాజేంద్ర గుప్తా, అశోక్ మిట్టల్, స్వాతి మాలివాల్, విక్రమ్ సాహ్నీలకు పంజాబ్ ప్రజలు, పార్టీ ఉన్నత అవకాశాలు కల్పించింది. ప్రజల ఆశీస్సుల వల్లే హర్భజన్ సింగ్‌కు రాజ్యసభలో అడుగుపెట్టే అవకాశం దక్కింది. కానీ, ఈ ఏడుగురూ పార్టీకి, రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారు” అని మండిపడ్డారు. బీజేపీ.. ఆపరేషన్ లోటస్‌ను మళ్లీ మొదలుపెట్టిందని, తమ పార్టీకి చెందిన ఏడుగురు ఎంపీలను ప్రలోభపెట్టడానికి ఈడీ, సీబీఐలను బీజేపీ వాడుకుందని ఆరోపించారు. మరోవైపు ముగ్గురు ఎంపీలు బీజేపీలో చేరడంపై రాజ్యసభ చైర్మన్‌కు ఫిర్యాదు చేసేందుకు ఆప్ సిద్ధమైంది.

**పంజాబ్ లక్ష్యంగా ఆపరేషన్..**

బీజేపీ ఇంత అకస్మాత్తుగా 'ఆపరేషన్ లోటస్' చేపట్టడం అందరినీ విస్మయానికి గురి చేసింది. అయితే వచ్చే ఏడాది పంజాబ్ లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఆ రాష్ట్రంలో పాగా వేయాలని కాషాయ నేతలు బలంగా కోరుకుంటున్నారు. ఇందుకు రాఘవ్ చద్దాను, ఇతర రాజ్యసభ సభ్యులను ఆయుధాలుగా మలచుకోనున్నారు. ప్రస్తుతం ఆప్ అధికారంలో ఉన్న పంజాబ్ లో బీజేపీకి అసలు ఏమాత్రం బలం లేదు. దశాబ్దాలుగా శిరోమణి అకాలీదళ్ తో పొత్తుతో పంజాబ్ లో బీజేపీ కొనసాగుతోంది. ఇక ఇప్పుడు స్వతంత్రంగా ఎదగాలని యోచిస్తోంది. అందుకోసమే ఆప్ నేతలను తమ పార్టీలో చేర్చుకొని, వారి ద్వారా రాష్ట్రంలో బలపడాలని భావిస్తోంది.





# ధర్మరాజు ఆడింది జూదమా? లేక క్షత్రియ ధర్మపు వలయాన్నా?

**మహాభారతం ఇది కేవలం ఒక ఇతిహాసం కాదు, మానవ మనస్తత్వ శాస్త్రానికి ఒక సజీవ విజ్ఞాన సర్వస్వం. కురుక్షేత్ర రణక్షేత్రం కంటే సంక్లిష్టమైన యుద్ధం ప్రతి మనిషి అంతరాత్మలో నిరంతరం జరుగుతూనే ఉంటుంది. ఆ సంఘర్షణలకు, నైతిక సంకటాలకు నిలువుటద్దం ఈ కావ్యం. యుగయుగాలుగా పండితులు, తాత్వికులు ఈ మహాకావ్యాన్ని మథించి అసంఖ్యాకమైన సత్యాలను వెలికితీశారు.**

అయినప్పటికీ, చరిత్రకారులను, సామాన్యులను నేటికీ వేధిస్తున్న ఒక మౌలిక ప్రశ్న అజాతశత్రువుగా పేరుగాంచిన యుధిష్ఠిరుడు జూదమాడి సర్వస్వాన్నీ పోగొట్టుకోవడం రాజధర్మానికి విరుద్ధం కాదా? అది నియమం ఉండేది. విదురుడు వంటి మేధావులు, గాంధారి వంటి హితైషులు హెచ్చరించినప్పటికీ, యుధిష్ఠిరుడు ఆ క్షత్రియ మర్యాద అనే వలయంలో చిక్కుకున్నాడు. క్షత్రియుడు సవాలును తిరస్కరించడం ఆచారవిరుద్ధమైన ఆ కాలంలో, యుధిష్ఠిరుని స్వేచ్ఛ ఎంత నిజంగా స్వేచ్ఛ? అనే సందేహం ఇక్కడ ఉదయిస్తుంది. అతని పతనం వ్యక్తిగత వ్యసనం కంటే, సామాజిక ఒత్తిడి వల్ల కలిగిన ప్రమాదంగా పండితులు విశ్లేషిస్తారు. మహాభారతంలో జూదం ఎప్పుడూ 'ఫెయిర్ ప్లే' (సమాన స్థాయి పోటీ) కాదు. అది ఒక క్రూరమైన రాజకీయ కుట్ర. శకుని దగ్గర ఉన్నవి మామూలు పాచికలు కావు. అవి అతని తండ్రి అస్థికలతో చేసినవని, అతని సంకల్పానికి అనుగుణంగా తిరుగుతాయని కథనం. ఇక్కడ యుధిష్ఠిరుడు ఒక సచ్ఛీలుని అమాయకత్వంతో ఆడాడు, శకుని ఒక కుటిల నీతితో స్పందించాడు. నిజానికి, యుధిష్ఠిరుడు తన విచక్షణను బట్టి మారుతూ ఉండే నిప్పు లాంటిది. చాలామంది అడిగే ప్రశ్న, కృష్ణుడు అంతా తెలిసినవాడై ఉండి జూదాన్ని ఎందుకు ఆపలేదు? అని. భగవద్గీతలో కృష్ణుడు చెప్పినట్లు, మనిషి తన కర్మను అనుభవించాల్సిందే. జూదం జరుగుతున్న సమయంలో కృష్ణుడు అక్కడ లేకపోవడం ఒక వ్యూహాత్మక విషాదం. అయితే, ద్రౌపది ఆర్తనాదంతో పిలిచినప్పుడు ఆయన అభయం ఇచ్చాడు. యుధిష్ఠిరుని ఈ పతనం ఒక మహత్తర నాటకంలో అంతర్భాగం. జూదం అనే అవమానం జరగకపోతే కురుక్షేత్ర యుద్ధం వచ్చేది కాదు, యుద్ధం రాకపోతే దుష్టశిక్షణ జరిగి ఉండేది కాదు, ప్రపంచానికి భగవద్గీత అందేది కాదు. కొన్నిసార్లు ఒక గొప్ప మార్పు కోసం, ఒక మహా వృక్షం కూలిపోవాల్సి వస్తుంది. ధర్మరాజు పతనం అటువంటి ఒక అవసరమైన విషాదం .నేటి కార్పొరేట్ లేదా రాజకీయ ప్రపంచంతో పోల్చి చూస్తే, యుధిష్ఠిరుని వైఖరిని లీడర్‌షిప్ ఫెయిల్యూర్

అతని వ్యక్తిత్వ వైఫల్యమా, లేక ఆనాటి సామాజిక కట్టుబాట్ల బందీనా? ఈ ప్రశ్న పైపైన చూస్తే చాలా సరళంగా అనిపించవచ్చు. కానీ, దీని మూలాల్లోకి వెళ్తే సంస్కృతి, రాజనీతి, మరియు వ్యక్తి స్వేచ్ఛల మధ్య జరిగే పెనుగులాట కనిపిస్తుంది. యుధిష్ఠిరుడు కేవలం ఒక జూదగాడు కాదు. అతను ఒక సామ్రాజ్యానికి అధిపతి, ఐదుగురు తమ్ముళ్లకు అగ్రజుడు, ద్రౌపదికి భర్త, అన్నింటికీ మించి ధర్మానికి ప్రతిరూపం. ఈ ఐదు పాత్రలూ మాయాజూదం అనే ఒకే ఒక్క వేదికపై అగ్నిపరీక్షకు గురయ్యాయి. మహాభారతంలోని శాంతిపర్వంలో భీష్మ పితామహుడు అంపశయ్యపై ఉండి ధర్మరాజుకు రాజనీతి రహస్యాలను బోధిస్తాడు. రాజు తన ప్రజలను పుత్రులవలె పరిరక్షించాలని, శత్రువులను జయించే బాహుబలంతో పాటు తన ఇంద్రియాలను అదుపులో ఉంచుకునే ఆత్మనిగ్రహాన్ని కలిగి ఉండాలని ఆయన నొక్కి చెబుతారు. మనుస్మృతి వంటి ధర్మశాస్త్రాలు కూడా ఇంద్రియ నిగ్రహం లేని రాజు రాజ్యాన్ని పాలించలేడు అని స్పష్టం చేశాయి. కౌటిల్యుడు తన అర్థశాస్త్రం లో రాజుకు ఉండకూడని పద్దెనిమిది రకాల వ్యసనాలను (దోషాలను) పేర్కొన్నాడు. వీటిలో ద్యూతం (జూదం) మొదటి వరుసలో ఉంది. కౌటిల్యుని విశ్లేషణ ప్రకారం, రాజు జూదానికి బానిసలైతే అతని విచక్షణ జ్ఞానం నశిస్తుంది, ఖజానా ఖాళీ అవుతుంది, ప్రజలు అనాథలవుతారు. ఇది కేవలం నైతిక బోధన మాత్రమే కాదు, రాజ్య సుస్థిరతకు సంబంధించిన కఠినమైన హెచ్చరిక. ఈ కోణంలో చూసినప్పుడు, రాజసూయ యాగం చేసి చక్రవర్తిగా వెలుగొందుతున్న యుధిష్ఠిరుడు జూదశాలలో అడుగుపెట్టడం రాజధర్మానికి గొడ్డలిపెట్టు అనడంలో సందేహం లేదు. ఇక్కడ మనం లోతుగా ఆలోచించాల్సిన విషయం ఒకటి ఉంది. యుధిష్ఠిరుడు తనంతట తానుగా జూదం ఆడాలని కోరుకున్నాడా? సభాపర్వంలోని కథనాన్ని పరిశీలిస్తే, ఇది అతని స్వయంకృతాపరాధం కంటే ఒక రాజకీయ ఉచ్చుగా కనిపిస్తుంది. దుర్యోధనుని ఆహ్వానం, దానికి ధృతరాష్ట్రుని ఆమోదముద్ర తోడయ్యాయి. అప్పటి సామాజిక నిబంధనల ప్రకారం, ఒక రాజు నుంచి వచ్చిన ఆహ్వానాన్ని తిరస్కరించడం యుద్ధానికి పిరికితనంతో సమానంగా భావించేవారు. ముఖ్యంగా క్షత్రియ ధర్మం ప్రకారం, యుద్ధానికి పిలిచినా, జూదానికి పిలిచినా వెనకడుగు వేయకూడదు అనే ఒక అలిఖిత



మేధస్సుతో ఆడి ఓడిపోయి ఉంటే అది క్రీడ అయ్యేది. కానీ అతను ఒక వ్యవస్థీకృత మోసానికి బలి అయ్యాడు. ఒక పక్క ధర్మం పక్షాన నిలబడిన వ్యక్తి, మరోపక్క అధర్మపు అంచుల్లో ఉన్న మోసగాడు ఈ అసమాన యుద్ధంలో సత్యవంతుడు ఓడిపోవడం కేవలం అతని బలహీనత కాదు, ఆ వ్యవస్థలోని లోపం. అందుకే, ఆ తప్పుకు ధర్మరాజును మాత్రమే ఏకపక్షంగా దోషిని చేయడం అన్యాయం అవుతుంది. యుధిష్ఠిరుని పతనంలో అత్యంత విషాదకరమైన మరియు వికృతమైన మలుపు ద్రౌపదిని పణంగా పెట్టడం. రాజ్యము, సంపద, తమ్ముళ్లు అంతా పోయాక తనను తాను ఓడిపోయిన ధర్మరాజు, తన భార్యను పణంగా పెట్టే అధికారం కలిగి ఉన్నాడా? సభలో వలువలు ఊడదీస్తున్న తరుణంలో ద్రౌపది అడిగిన ప్రశ్న నేటి ఆధునిక న్యాయశాస్త్రానికే ఒక పాఠం. తన్ను తాను ఓడిపోయిన వ్యక్తికి, ఇతరులను పణంగా పెట్టే హక్కు ఎక్కడిది? ఈ ప్రశ్నకు ఆ సభలోని భీష్మ, ద్రోణ వంటి హేమాహేమీలు తలదించుకున్నారే తప్ప సరైన సమాధానం చెప్పలేకపోయారు. భీష్ముడు ధర్మం సూక్ష్మమైనది అని దాటవేయడం చూస్తే, అక్కడ చట్టం ఎంత నిస్సహాయంగా ఉందో అర్థమవుతుంది. ఈ ఘట్టం మనకు ఒక లోతైన సందేశాన్నిస్తుంది. ధర్మం అనేది పుస్తకాల్లో ఉండే సూత్రం కాదు, అది సందర్భాన్ని బట్టి, పాత్రల (నాయకత్వ వైఫల్యం) కింద జమ కట్టవచ్చు. ఒక నాయకుడు తీసుకునే పొరపాటు నిర్ణయం అతనిని నమ్ముకున్న టీమ్ (పాండవులు)ని, అతని వ్యవస్థ (రాజ్యం)ను ఎంతటి ప్రమాదంలోకి నెడుతుందో ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. కానీ, అసలైన నాయకుడికి ఉండాల్సిన లక్షణం తన తప్పును అంగీకరించడం. అరణ్యవాసంలో యుధిష్ఠిరుడు తన తప్పును ఇతరులపై నెట్టలేదు. ఆ పదమూడేళ్ల వనవాసం అతనిని ఒక మచ్చలేని బంగారంగా మార్చింది. తనను తాను మలచుకున్న తీరు, తన తమ్ముళ్ల ఆగ్రహాన్ని శాంతింపజేసిన విధానం అతన్ని మళ్ళీ గొప్ప నాయకునిగా నిలబెట్టాయి. పతనం కావడం మనిషి లక్షణం, పతనం నుంచి పాఠం నేర్చుకుని తిరిగి లేవడం మహాత్ముని లక్షణం. యుధిష్ఠిరుడు జూదమాడటం రాజధర్మానికి విరుద్ధమా? అంటే, నైతికంగా అది ముమ్మాటికీ తప్పే. కానీ మహాభారతం మనకు నలుపు తెలుపుల మధ్య ఉండే బూడిద రంగు (+తీవఎ ఖతీఘు౦) జీవితాన్ని పరిచయం చేస్తుంది. ఒక సత్యవంతుడు కూడా అహంకారం, అలసత్వం లేదా సామాజిక ఒత్తిడి వల్ల తడబడవచ్చని ఇది మనల్ని హెచ్చరిస్తుంది. మహాభారతాన్ని కేవలం ఒక కథగా చదవడం అంటే సముద్రం ఒడ్డున అలలను చూడటమే. దాని లోతుల్లోకి వెళ్తే, ధర్మరాజు మన ప్రతి ఒక్కరిలో కనిపిస్తాడు. జీవితంలో మనం తీసుకునే చిన్న చిన్న తప్పుడు నిర్ణయాలు మనల్ని ఎక్కడికి చేరుస్తాయో ఈ కథ ఒక హెచ్చరిక. అయితే, పతనం తర్వాత కూడా ధర్మాన్ని వీడకుండా నిలబడటం ఎలాగో ధర్మరాజు జీవితం నేర్పుతుంది. చివరకు అతడు స్వర్గానికి తన శరీరంతో వెళ్లగలిగాడంటే, అది అతను జూదం ఆడినందుకు కాదు, ఆ తప్పు నుంచి నేర్చుకున్న పరివర్తన వల్ల!

మహాభారతం ఒక తీర్పు కాదు, అది ఒక దర్శనం. ఇందులో యుధిష్ఠిరుడు ఒక నీడలో తడబడిన వెలుగు. ఆ వెలుగు మన దారిని ప్రకాశింపజేయాలి!



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

## మద్యం కుంభకోణంలో
# కొత్త కోణం!

(మొదటి పేజీ తరువాయి)

ఈడి అధికారులు ఏకకాలంలో తనిఖీలు జరిపారు. ప్రత్యేక దర్యాప్తు బృందం ఇచ్చిన నివేదిక, మరోవైపు సిఐడి నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీ లాండరింగ్ కోణంలో సోదాలు కొనసాగిస్తోంది ఈడి.

**నాలుగు వేల కోట్ల రూపాయల కుంభకోణం**

వైసిపి హయాంలో మద్యం కుంభకోణంలో 4 వేల కోట్ల రూపాయల వరకు పక్కదారి పట్టిందన్నది ప్రధాన ఆరోపణ. గత ప్రభుత్వ హయాంలో మద్యం సేకరణ, పంపిణీలు భారీ అక్రమాలు జరిగాయని సీట్ తన నివేదికలో స్పష్టం చేసింది. అప్పట్లో ఆన్లైన్ పేమెంట్ వ్యవస్థను నిలిపివేసి.. నగదు రూపంలోనే లావాదేవీలు సాగించడం ద్వారా నాలుగు వేల కోట్ల రూపాయల వరకు ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఇలా ఈ కుంభకోణం ద్వారా వచ్చిన నల్లధనాన్ని విదేశాలకు మళ్ళించడమే కాకుండా.. బినామీ కంపెనీల పేరుతో ఇతర వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టినట్లు ఈడీ ప్రాథమిక ఆధారాలను సేకరించగలిగింది.

**సాయి రెడ్డి ఇంట్లో సైతం..**

అయితే అన్నింటికీ మించి విజయసాయిరెడ్డి ఈ కేసులో విచారణ చేపడుతుండడం విశేషం. గతంలో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సీట్ చాలామందిని అరెస్టు చేయగలిగింది కానీ.. విజయసాయిరెడ్డి జోలికి పోలేదు. ఆయన అప్రూవర్ గా మారడంతో అప్పట్లో విడిచి పెట్టారన్న కామెంట్ వినిపించింది. కానీ ఇప్పుడు ఈ డి విచారణను తప్పించుకోలేకపోయారు విజయసాయిరెడ్డి. ఆయన నివాసంతో పాటు కార్యాలయంలో కూడా తనిఖీలు చేసింది ఈడి. హైదరాబాదులోని ఏకకాలంలో జరిపిన ఈ తనిఖీలు సంచలనంగా మారాయి.

**చెవిరెడ్డి పరారీ..**

ఇంకోవైపు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఇంటికి తాళం వేసి వెళ్లిపోవడం సంచలనంగా మారింది. ఈ కేసులో ఆయన కీలక నిందితుడిగా ఉన్నారు. సుదీర్ఘకాలం జైలులో ఉండి బెయిల్ పై బయటకు వచ్చారు. అయితే ఇప్పుడు ఈ డి విచారణ జరుగుతుందని తెలిసి ఆయన కుటుంబంతో సహా ఇంటికి తాళం వేసి వెళ్లారన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. మొత్తానికి అయితే మద్యం కుంభకోణం కేసులో ఈడి ఎంట్రీ ఇప్పుడు సంచలనంగా మారింది. ముున్ముందు ఈడి అరెస్టుల పర్వానికి దిగవచ్చన్న అనుమానాలు కూడా ఉన్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# గొడ్డలి పార్టీతో జాగ్రత్త సుమా

**అమరావతి, (క్రైమ్ మిర్రర్):** వైసిపి రాజకీయ కుట్రలతో అప్రమత్తంగా ఉండాలని టిడిపి శ్రేణులనుఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. కిల్లర్ పార్టీతో టీడీపీ నేతలు అందరూ జాగ్రత్తగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. కిల్లర్ పార్టీ ఆలోచనా విధానాన్ని ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి కౌంటర్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో కిల్లర్ పార్టీ దారుణాలకు తెగబడుతోందని.. వారి ఆగడాలు చెల్లనివ్వమని హెచ్చరించారు. జగన్ అండ్ కో రోడ్ల మీదకు వస్తారని, రెచ్చగొడతారని, రప్పా రప్పా అంటారని, ప్రజలను ఇబ్బందులు పెడతారని, చర్యలు తీసుకుంటే రాజకీయ కక్ష అంటారని ఎద్దేవా చేశారు. శుక్రవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌ల శిక్షణా తరగతులకు ముఖ్యమంత్రి హాజరయ్యారు. శిక్షణా తరగతులకు వచ్చిన క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో కాఫీ కబుర్లు కార్యక్రమం నిర్వహించి.. వారికి పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత బలోపేతం, ప్రభుత్వ పథకాల వంటి అంశాలపై సీఎం చంద్రబాబు మార్గనిర్దేశర చేశారు. ప్రతి కార్యకర్తను నాయకుడిగా తీర్చిదిద్దుతామని... కేడర్ దాన్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. సమకాలీన రాజకీయాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని సీఎం దిశానిర్దేశర చేశారు. అధికారం కోల్పోయిన తర్వాత కూడా వైసీపీ చేస్తున్న అరాచకాలను వివరించారు. ప్రస్తుత పరిణామాల్లో క్రిమినల్స్‌తో రాజకీయం చేయాల్సిన పరిస్థితి వచ్చిందనే విషయాన్ని నిరంతరం గుర్తుపెట్టుకోవాలని అన్నారు. ఇటీవల జరిగిన పెద్ద దస్తగిరి హత్య, ఎమ్మెల్సీ అనంతబాబు బరితెగింపు వంటి అంశాలను ప్రస్తావించారు. తన జీవితంలో ఎన్నో రాజకీయ పోరాటాలు చేశాను తప్ప... నేరగాళ్లతో ఏనాడూ పోరాడలేదని.. ఇది తనకు కొత్తగా ఉందని తెలిపారు. వైసీపీ సోషల్ సైకోలతో తప్పుడు ప్రచారాలు చేయిస్తున్నారని దుయ్యబట్టారు. వైసీపీ లాంటి పార్టీని తన జీవితంలో ఎప్పుడూ చూడలేదని ఎద్దేవా చేశారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని గొడ్డలి పార్టీ ఎమ్మెల్సీ హత్య చేశారని.. కోర్టులో సాక్ష్యం చెప్పినవారిని కూడా బెదిరించారని ధ్వజమెత్తారు. గొడ్డలి పార్టీ చేసే అరాచకాలను అనునిత్యం ప్రజలకు కేడర్ వివరిస్తూనే ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు. అవకాశాలను ఉపయోగించుకుని కార్యకర్తలు నాయకులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రజలకు మంచి చేస్తే ప్రజలు నిరంతరం గుర్తుంచుకుంటారని వ్యాఖ్యానించారు. సుదీర్ఘ కాలం అధికారంలో ఉంటేనే అభివృద్ధి సాధ్యమని ఉద్ఘాటించారు. 2019లో వైసీపీ గెలిచాక ఏపీలో అభివృద్ధి జరగలేదని ప్రస్తావించారు. తనను అరెస్టు చేసినా, పార్టీని ఇబ్బంది పెట్టినా కార్యకర్తలను కాపాడుకున్నానని స్పష్టం చేశారు. రాజకీయాలను దాటి సామాన్య ప్రజలను కూడా జగన్ హయాంలో ఇబ్బందులకు గురి చేశారని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. 2019-24 మధ్య జరిగిన విధ్వంసాన్ని ప్రజలకు నిత్యం గుర్తు చేయాలని అన్నారు. మనం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించడంతోపాటు.. కార్యక్రమాల అమలుకు ప్రభుత్వం పడే కష్టలను ప్రజలకు వివరించాలని సూచించారు. టీడీపీలో కార్యకర్తలే అధినేతలని.. పార్టీ కూడా కార్యకర్తలను అలాగే గౌరవిస్తోందని స్పష్టం చేశారు. అన్యాయం జరిగిందని జగన్ రెడ్డి పరామర్శకు వెళ్తారని... కార్యకర్తలను కార్ల కింద తొక్కించి చంపేస్తారని... కానీ తన కారు కింద పడిపోయిన కార్యకర్తను మాత్రం ఎందుకు పరామర్శించరని ప్రశ్నించారు. కడపలో సొంత పార్టీ కార్యకర్తనే హత్య చేశారని ఆరోపించారు. కడప డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి కలిసి ప్రభుత్వ భూములను దోపిడీ చేశారని ఆగ్రహించారు. పంపకాల్లో విభేదాలు రావడంతో దస్తగిరి అనే వైసీపీ కార్యకర్తను చంపేశారని సీఎం చంద్రబాబు ఆరోపించారు. వాళ్ల అనుచరులను వాళ్లే చంపుకుని నేరం తమపై నెట్టేస్తున్నారని ధ్వజమెత్తారు.

## నాందెండ్లకు కెటిఆర్ నివాళి

హైదరాబాద్: ఇటీవల మరణించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు చిత్రపటానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని నాదెండ్ల నివాసానికి వెళ్లి ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ ను, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చురు. ఈ సందర్భంగా తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీ రాజు శంభీపూర్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు నాదెండ్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించిన వారిలో ఉన్నారు. నాదెండ్ల మనోహర్ గారిని మరియు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## డ్రైవర్ శంకర్ గౌడ్ మృతికి దిగ్భ్రాంతి

### ఆత్మహత్యలు సరికావన్న పద్మాదేవేందర్

మెదక్,ఏప్రిల్24: ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆత్మహత్యకు పాల్పడటం అత్యంత బాధాకరమని పేర్కొంటూ, మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ దుర్ఘటన వారి కుటుంబానికి తీరని లోటని అన్నారు. ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, న్యాయమైన హక్కుల కోసం వారు చేస్తున్న పోరాటం సమంజసమని, అయితే ఆ పోరాటంలో ప్రాణాలను కోల్పోవడం సరైంది కాదని స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులు ధైర్యంగా ఉండాలని, ఎలాంటి ఆత్మహత్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు.

## పారిశ్రామికవేత్తల ఆమోదంతోనే హిల్ట్ పాలసీ

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** సచివాలయంలో ఆదాయ వనరుల సమీకరణపై కేబినెట్ సబ్ కమిటీ సమావేశం అయింది. సవరించిన మార్కెట్ విలువలను అమలు చేయాలని నిర్ణయించింది. మే మొదటి వారం నుంచి రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ ధరలు పెరగనున్నాయి. పారిశ్రామికవేత్తల ఆమోదంతోనే హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ హిల్ట్ పాలసీ అమలుకానున్నట్లు కేబినెట్ సబ్ కమిటీ

తెలిపింది. ఓఆర్ఆర్ బయట ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. ఆదాయ సమీకరణపై అశ్రద్ధ వహిస్తే వేటు తప్పదని అధికారులను కేబినెట్ సబ్ కమిటీ హెచ్చరించింది. కొత్త ఇండస్ట్రియల్ పాలసీలో కార్మికుల వసతి కోసం డార్మెటరీలు తప్పనిసరి చేసింది. కాగా, రాష్ట్రంలో వ్యవసాయ భూముల మార్కెట్ విలువ గరిష్ఠంగా రెండు నుంచి మూడు రెట్లు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎకరాకు 6 లక్షల రూపాయలుగా ఉన్న విలువ 12 లక్షల రూపాయల నుంచి 18 లక్షల రూపాయల వరకు పెరిగే అవకాశం ఉంది. హైదరాబాదు నగరం తో పాటు, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్ఫర్మేషన్ తీసుకువచ్చిందని, ఈ పాలసీని ప్రజాస్వామ్య పద్ధతిలో అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ రిసోర్స్ మొబ లైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం కమిటీ చైర్మన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తో పాటు కమిటీ సభ్యులు, మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావులు పాల్గొన్నారు.

పాలసీపై సమీక్ష సమావేశంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్స్ ప్రతినిధులు సైతం పాల్గొని వారి అభిప్రాయాలు తెలిపారు. ఎయిర్ పొల్యూషన్ ఇండెక్స్ గణనీయంగా పెరిగిపోతున్న తరుణంలో కాలుష్యకారక పరిశ్రమలు అన్నిటిని ఓఆర్ఆర్ అవతలికి తరలించాలని కంపల్సరీ చేస్తే అందరూ వెళ్ళిపోతారని కొందరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ల ప్రతినిధులు స్వయంగా చెప్పినప్పటికీ, మేం అందరి అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు పోతున్నామని డిప్యూటీ సీఎం వివరించారు. అన్ డెవలప్డ్ ల్యాండ్ పాలసీ కింద భూములను అభివృద్ధి చేసే కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, ఇండస్ట్రియల్ పార్కుల ప్రతినిధులు కలిసి అభివృద్ధి చేసుకునే ఆలోచన చేయాలి అన్నారు.

ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేస్తే మంచిదని, చైనా తరహాలో ప్రత్యేకంగా పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయాలని ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రతినిధులు సూచించారు ఈ సూచనలను స్వాగతిస్తున్నాం, పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

# కార్మికుల శ్రమ తగ్గడమే లక్ష్యం





### కాసిపేట గనిలో 'మ్యాన్ రైడింగ్' ప్రారంభం

### రూ. 4.26 కోట్లతో రవాణా సౌకర్యం

### మందమర్రి ఏరియాలో సింగరేణి డైరెక్టర్ కె.వెంకటేశ్వర్లు పర్యటన

**మందమర్రి,ఏప్రిల్ 24 (క్రైమ్ మిర్రర్):** బొగ్గు గనుల్లో పనిచేసే కార్మికుల సంక్షేమానికి సింగరేణి యాజమాన్యం పెద్దపీట వేస్తోందని సంస్థ డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కె.వెంకటేశ్వర్లు అన్నారు.శుక్రవారం ఆయన మందమర్రి ఏరియాలో విస్తృతంగా పర్యటించారు. ఏరియా జీఎం ఎన్.రాధాకృష్ణతో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు.కాసిపేట1ఎ గనిలో సుమారు రూ. 4.26 కోట్ల వ్యయంతో 1350 మీటర్ల పొడవునా ఏర్పాటు చేసిన 'మ్యాన్ రైడింగ్' వ్యవస్థను డైరెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గని లోపల పని ప్రదేశానికి చేరుకోవడానికి కార్మికులు కిలోమీటర్ల మేర నడిచి వెళ్లాల్సిన శ్రమ తప్పుతుందన్నారు.దీనివల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా,కార్మికులు ఉత్సాహంగా పని చేయవచ్చని,తద్వారా ఉత్పత్తి పెరుగుతుందని పేర్కొన్నారు.అనంతరం కేకే ఓపెన్ కాస్ట్ గనిని వ్యూ పాయింట్ నుంచి సందర్శించి,బొగ్గు వెలికితీత పనులను పర్యవేక్షించారు. రామకృష్ణపురంలో నిర్మాణంలో ఉన్న సర్ఫేస్ మిక్స్డ్ ఎమల్షన్ (ఎస్ఎంఈ) ప్లాంట్‌ను సందర్శించి,పనుల పురోగతిపై అధికారులను ఆరా తీశారు.మిగిలిన పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఏరియాలో జరుగుతున్న సివిల్, సాంకేతిక పనుల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పర్యటనలో భాగంగా డైరెక్టర్ కె.వెంకటేశ్వర్లు దంపతులు, జీఎం రాధాకృష్ణ దంపతులు మందమర్రిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు వారికి ఘనస్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం జి.ఎల్.ప్రసాద్, ఏఐటీయూసీ నాయకులు సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్,కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు, డీజీఎం అశోక్,ఏరియా ఇంజినీర్ బాలాజీ భగవతి,గని మేనేజర్లు సతీష్, రామరాజు,పీఈ వంశీధర్, సివిల్ ఎస్.ఈ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



## హిందు సమ్మేళనానికి రూ.2.11 లక్షలు విరాళం అందజేసిన నీరుడు శేఖర్‌ముదిరాజ్

**గండిపేట(క్రైం మిర్రర్):** మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవడం అందరి బాధ్యతగా భావించాలని కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్ నీరుడు శేఖర్‌ముదిరాజ్ అన్నారు. ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్న హిందు సమ్మేళన కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ కమిటీ సభ్యులు శుక్రవారం ఆయనను కలిశారు. కమిటీ పిలుపుకు ఆయన స్పందించి సమాజ సేవా దృక్పదంతో ముందుకు వచ్చి కార్యక్రమ నిర్వహణకు తమవంతు సహకారంగా 2,11,000 రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ విరాళం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించనుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శేఖర్‌ముదిరాజ్ సేవా భావాన్ని అభినందిస్తూ సమాజంపై ఆయనకున్న నిబద్ధత ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఆయన అందించిన సహకారం ఇతరులకు కూడా ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా నీరుడు శేఖర్‌ముదిరాజ్ మాట్లాడుతూ హిందు సమాజ ఐక్యత కోసం ఇలాంటి సమ్మేళనాలు అత్యంత అవసరమని అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, సమాజంలో చైతన్యం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. బండ్లగూడ జాగీరు, పరిసర ప్రాంతాల ప్రజలందరూ కుటుంబ సమేతంగా పెద్ద ఎత్తున పాల్గొని ఈ సమ్మేళనాన్ని ఘన విజయంగా నిలపాలని ఆయన పిలుపునిచ్చారు. హిందు సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

## డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ

### 100% సబ్సిడీతో భద్రతా కిట్లు అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్..!



**జగిత్యాల జిల్లా బ్యూరో(క్రైమ్ మిర్రర్):** కార్మికులు ప్రాణ రక్షణకు కిట్లను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు.జగిత్యాల పట్టణంలో జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు, మాజీ లైబ్రరీ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో కల్లుగీత కార్మికుల భద్రత కోసం ప్రత్యేక కార్యక్రమం ఘనంగా జరిగింది. గొల్లపల్లి రోడ్డులోని మోతెప్ ఎల్లమ్మ ఆలయం వద్ద గల గౌడ సంఘం దగ్గర, జిల్లా వెనుకబడిన తరగతుల (దీజ) సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన గీత కార్మికులకు 100 శాతం సబ్సిడీతో 'కాటమయ్య రక్షణ కిట్ల'ను పంపిణీ చేశారు. డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి గీత కార్మికులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.?ప్రాణ రక్షణే ప్రభుత్వ ధ్యేయం:ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్, డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్ తో కలిసి కార్మికులకు రక్షణ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గీత కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ కిట్లను తీసుకువచ్చిందన్నారు. కార్మికులు పాత పద్ధతులను వీడి, తప్పనిసరిగా రక్షణ కిట్లను ఉపయోగించే చెట్లు ఎక్కాలని సూచించారు. ప్రాణ రక్షణ కోసం ఇచ్చిన ఈ తాళ్లను పశువులను కట్టేయడానికి లేదా ఇతర ఇంటి అవసరాలకు వాడొద్దని కోరారు.?అందరికీ కిట్లు - డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్ కృషి: కార్మికుల సంక్షేమం పట్ల డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్ తీసుకుంటున్న చొరవను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. నిపుణులైన శిక్షకుల ద్వారా కిట్ల వినియోగంపై అవగాహన పెంచుకోవాలని కార్మికులకు సూచించారు. ఎంతమంది దరఖాస్తు చేసుకున్నా నిరంతర ప్రక్రియ ద్వారా అందరికీ కిట్లు అందజేస్తామని హామీ ఇచ్చారు.

**పాల్గొన్న ప్రముఖులు:**

ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్ తో పాటు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి సునీత, సీఐ సర్వేశ్వరరావు, ఎస్సై, సర్పంచ్ మహేష్, పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు పంజాల తిరుపతి గౌడ్, న్యాయమూర్తి మల్లేశం గౌడ్, ఇతర గౌడ సంఘం సభ్యులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న రిషికేశ్వర్ వైద్యానికి ఆర్థిక సహాయం అందించండి:నారాయణ శ్రీలత దంపతులు




**మందమర్రి టౌన్ ఏప్రిల్ 24 క్రైమ్ మిర్రర్:** బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతున్న పదేళ్ల అబ్బాయి రిసికేశ్వర్ వైద్యానికి దాతలు ఆర్థిక సహాయం చేసి మా కుమారుని ప్రాణాలు కాపాడాలని నారాయణ శ్రీలత దంపతులు శుక్రవారం మందమర్రి విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మందమర్రి రెండోజోన్లో నివాసం ఉంటున్న వేనవంక నారాయణ- శ్రీలత దంపతులకు కూతురు మనస్విత కొడుకు రిషికేశ్వర్ సంతానం.ఈ దంపతులు ప్రైవేట్ ఉపాధ్యాయులుగా పనిచేస్తూ తమ పిల్లలకు ఏ లోటు రాకుండా మంచిగా చూసుకుంటున్నారు.కొడుకు రిషికేశ్వర్ మందమర్రి మాంటిస్సోరి పాఠశాలలో 4వ తరగతి, కూతురు మనస్విత మోడల్ పాఠశాలలో 8వ తరగతి పూర్తి చేశారు. చిన్నతనం నుంచి చదువులో చురుకుగా ఉండే రిషికేశ్వర్ తల్లిదండ్రులు, తోటి వారి పట్ల బాధ్యతగా ఉంటున్నామని అన్నారు. ఇప్పటికే 35 లక్షల వరకు అప్పుచేసి ఖర్చు చేశామని ఇంకా 20 లక్షలు కావాలని ఎవరైనా దాతలు ఈ యొక్క ఆర్థిక సహాయాన్ని చేసి మా కుమారుని ప్రాణాలు కాపాడాలని ప్రాధేయపడుతున్నామన్నారు.దాతలు ఎవరైన రిషికేశ్వర్ కు వైద్యం కోసం డబ్బులు ఇవ్వాలనుకుంటే గూగుల్ పే, ఫోన్పే నెంబర్: 9949156031 వేనవంక నారాయణ శ్రీలత కు పంపించాలని వేడుకుంటున్నారు.

## ఖానామేట్‌లో స్క్రాప్ షాప్‌లో అగ్ని ప్రమాదం....



మాదాపూర్ క్రైమ్ మిర్రర్ : మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శుక్రవారం ఉదయం ఖానామేట్ ప్రాంతంలోని ఒక స్క్రాప్ షాప్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న వెంటనే ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ. శ్రీధర్ కుమార్, ఆర్ఎస్ఐ జీవేందర్ మరియు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వారితో పాటు అగ్నిమాపక శాఖ అధికారులు, డీఆర్ఎఫ్ బృందం, లా అండ్ ఆర్డర్ పట్రోల్ మొబైల్ సిబ్బంది, విద్యుత్ శాఖకు చెందిన ఏఈ రంగారెడ్డి సిబ్బంది కూడా వెంటనే స్పందించారు. అందరూ సమన్వయంతో చర్యలు చేపట్టి అగ్నిని అదుపులోకి తీసుకువచ్చి పూర్తిగా ఆర్పివేశారు. ప్రస్తుతం సంఘటనా స్థలంలో ఎటువంటి సమస్యలు లేవని అధికారులు తెలిపారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

## తిరుమలాయపాలెం మండలంలో కొత్తగా మరో 33 కె.వి విద్యుత్ లైన్ ప్రారంభం

### ప్రజా శ్రేయస్సు లక్ష్యంగా విద్యుత్ శాఖ ముందడుగు

### రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడంలో తిరుమలాయపాలెం విద్యుత్ శాఖ పనితీరు బేస్



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తిరుమలాయపాలెం మండలం లోని విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేసేది ఒక కీలకంగా ముందడుగు వేయబడింది శుక్రవారం,మండలంలో పరిపరి దపాలుగా వెలువెత్తుతున్న సమస్యలను నిలువరించడానికి విద్యుత్ సమస్యను అధిగమించటానికి అనుసంధానంగా మరిపెడ బంగ్లా పరిధిలోని 33 కెవి ఒకటవ లైన్ ను తిరుమలాయపాలెం మండలం హైదర్ సాయిపేట సబ్ స్టేషన్ కు బ్యాక్ ఫీడింగ్ సప్లై అందించేందుకు సుమారు 6.3 కిలోమీటర్ల నూతన విద్యుత్తు లైన్ నిర్మాణం విజయవంతంగా పూర్తి చేయబడింది.ఈ నూతన లైను గౌరవ సూపర్డెంట్ ఇంజనీరింగ్ ఖమ్మం జిల్లా ఇనుగుర్తి శ్రీనివాస చారి ఈరోజు లాంచనంగా ప్రారంభించారు. సుమారు 80 లక్షల వ్యయంతో నిర్మించబడిన ఈ లైన్ పురుషోత్తమయి గూడెం నుండి హైదర్ సాయి పేట సబ్ స్టేషన్ వరకు విస్తరించి ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా హైదర్ సాయి పేట జోగులపాడు పడమటి తండా తిప్పారెడ్డిగూడెం అజ్మీర తండా గ్రామాలకు ప్రత్యక్షంగా నిరంతరం నాణ్యమైనవిద్యుత్ సరఫరా అందించబడుతుంది. అలాగే దమ్మాయిగూడెం పిండిప్రోలు కేశవాపురం పాతర్లపాడు జల్లేపల్లి జోగులపాడు పురుషోత్తమయి గూడెం తదితర మరిపెడ మండలాలలోని పలు గ్రామాలకు పరోక్షంగా కూడా విద్యుత్ సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు ఈ లైన్ వారధిగా నిలుస్తుంది.రైతులకు మెరుగైన విద్యుత్ అందించడం లక్ష్యంగా ఈ విద్యుత్తు లైను ఏర్పాటు చేయడం జరిగింది. గతంలో విద్యుత్తు లైన్లలో అనుకొని అంతరాయాలు సంబంధించి నా సందర్భాల్లో ప్రతి సబ్బే షన్కు ప్రత్యామ్నాయంగా బ్యాక్ ఫీడింగ్ లైన్ ఉండటం వల్ల ఒకవైపు లైన్ లో సమస్యలు ఏర్పడిన మరోవైపు లైన్ ద్వారా క్షణాల్లో విద్యుత్ సరపరను పునరుద్ధరించడం సాధ్యమవుతుంది,ఈ సందర్భంగా హైదర్ సాయి పేట మరియు పడమర తండా గ్రామ ప్రజలు విద్యుత్ శాఖ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమం పై హర్షం వ్యక్తం చేశారు. 2024 లో వచ్చిన వరదల తాకిడికి తిరుమలాయపాలెం మండలంలో ఆఖరి ఎటు పరివాహక ప్రాంతాలలో విద్యుత్తు పూర్తిగా ధ్వంసమై రైతులకు నేటి వరకు కూడా రకరకాల ఇబ్బందులకు ఉండేటివి కానీ ఇప్పుడు ఈ సమస్యని అధిగమించటానికి ఈ బ్యాక్ ఫీడింగ్ లైన్ ద్వారా విద్యుత్ రైతులకు మెరుగైన విద్యుత్తును అందించడంలో విద్యుత్ శాఖ ఇప్పుడు అన్ని విధాల సమన్వయంతో పనిచేస్తుందని తద్వారా విద్యుత్ శాఖకు లైన్ల ద్వారా ఎలాంటి ఇబ్బందులు తలెత్తే అవకాశం లేకుండా ఉంటుందని రైతులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాస చారి డివిజనల్ ఇంజనీర్ శ్రీ బి వెంకటేశ్వరరావు ఎం ఆర్ టి డివిజన్ డివిజనల్ ఇంజనీర్ శ్రీ బద్రు పవార్ ఏ డి ఈ కోక్య నాయక్ ఏఈ నరేందర్ రెడ్డి సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ కిలారు నాగేశ్వరరావు మరియు ఫీల్డ్ సిబ్బంది పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినారు.

# బస్తీలు, కాలనీల్లో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ నీరు

### నెలలు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

### ఇబ్బందులు పడుతున్న ప్రజలు

### మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సురెడ్డి వినయ్‌రెడ్డి

**గండిపేట(క్రైం మిర్రర్):** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో బస్తీలు, కాలనీల రోడ్లు మురుగు నీటి ప్రవాహంతో తీవ్ర ఇబ్బందులు సృష్టిస్తున్నాయని డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సురెడ్డి వినయ్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం జలమండలి శాఖ కార్యాలయంలో మేనేజర్ అందుబాటులో లేకపోవడంతో అధికారికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో కొనసాగుతున్న పౌర సమస్యలపై ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నామన్నారు. ముఖ్యంగా డ్రైనేజీ నీరు నిల్వ సమస్య ఉందని పెద్ద పైపులైన్ నిర్వహణ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత మూడు



నెలలుగా దుర్గానగర్ ప్రాంతంలో డ్రైనేజీ నీరు నిల్వ సమస్య కొనసాగుతుందన్నారు. ముఖ్యంగా దుర్గా కిడ్స్ స్కూల్ వెనుక భాగంలో నిల్వ నీరు ఉండటం వల్ల స్థానిక ప్రజలు, చిన్న పిల్లలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందన్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికి సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వారి నిర్లక్ష్యాన్ని చూపిస్తుందన్నారు. ఇది చాలా దురదృష్టకరమన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఉన్న టి.ప్రకాష్‌గౌడ్ కూడా ఈ ప్రాథమిక సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్, రాజేంద్రనగర్ ప్రజలకు అభివృద్ధి కనిపించడం లేదన్నారు. డ్రైనేజీ నీరు నిల్వ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలన్నారు. పైపులైన్ నిర్వాహణను మెరుగు పరచాలన్నారు. ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రతను కాపాడాలన్నారు. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే ప్రజల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం పడే అవకాశం ఉంటుందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, జిల్లా ఐటీ ఇన్‌చార్జీ వెంకటరమణగుప్తా, బొమ్మ రాజునర్సింహ్మ, వై.నర్సురెడ్డి, గూడూరి అంజి, కొండల్, జే.ప్రేమ్, గణేష్, వేణు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## వేసవిలో ప్రజల దాహం తీర్చే చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరం

### పాలేరు ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ ఎస్ఐ కూచిపూడి జగదీష్

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** వేసవిలో ఉష్ణోగ్రతలు తీవ్రతరం అవుతున్న తరుణంలో ప్రజల దాహం తీర్చేందుకు మేకల తండా గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకులు గుగులోత్ గణేష్ సతీమణి జ్యోతి దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం వరంగల్ ప్రధాన జాతీయ రహదారి వెంబడి మేకల తండా స్టేజీలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని ప్రారంభించడానికి ముఖ్య అతిథులుగా పాలేరు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ స్థానిక ఎస్సై కూచిపూడి జగదీష్ హాజరయ్యారు. చలివేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయటం ఎంతో అభినందనీయమని వారన్నారు. ఈ చలివేంద్రం బాటసారిలకు వాహనదారులు రైతు కూలీలు విద్యార్థులు ప్రయాణికులకు మంచినీటి ఎంతో ఉపయోగపడుతుందని వారు అన్నారు గుగులోత్ గణేష్ మంచి స్నేహశీలి ఆపద లో ఉన్నవారికి సహాయ సహకారాలు అందిస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో గణేష్ ముందు వరుసలో ఉంటాడని గణేష్ ని వారు ప్రశంసించారు గణేష్ లాంటి వ్యక్తిత్వం ఉన్న మంచి మనిషి నీ ఆదర్శంగా తీసుకొని యువత సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలని వారన్నారు ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ జడల నగేష్ మేకలతండా సర్పంచ్ లక్ష్మి మేడిదపల్లి సర్పంచ్ మోర అనిల్ రెడ్డి మేకల తండా ఉప సర్పంచ్ వీరు గ్రామ వార్డ్ మెంబర్లు భూక్య బాలకృష్ణ బోడ వీరన్న బోడ శారద బానోత్ భద్రమ్మ గ్రామ పెద్దలు భూక్య మంగ్యా బూడియా హుస్సేన్ హైమావతి ధరావత్ శక్రు బోడ సామ్య బోడ శ్రీను బోడ రాంబాబు డిసి శంకర్ అన్వేష్ మోతిలాల్ ఉపేందర్ కాళోజి బాలాజీ శంకర్ ఎల్ఐసి శ్రీను రాజేష్ నాను బాసు సాగర్ కోటిరెడ్డి సురేష్ ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లాలో అక్రిడిటేషన్ కమిటీని వెంటనే ప్రకటించాలి

### అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలి

### తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టజేఏ) ఖమ్మం జిల్లా అధ్యక్షులు జి. నాగ స్వామి



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్ కమిటీని తక్షణమే ప్రకటించి అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జి. నాగ స్వామి ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మంలో మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాల్లో అక్రిడిటేషన్ కమిటీల ఏర్పాటు పూర్తి కావడంతో పాటు తొలి సమావేశాలు కూడా నిర్వహించబడుతున్నాయని ఖమ్మం జిల్లాలో మాత్రం ఇప్పటికీ కమిటీ ప్రకటించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులు అక్రిడిటేషన్ కార్డుల కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారని కమిటీ ఆలస్యంతో జర్నలిస్టులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించి అక్రిడిటేషన్ కమిటీని ప్రకటించి, కార్డుల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన కోరారు. ఖమ్మం జిల్లాలో ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యం తగదని జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని జి. నాగ స్వామి స్పష్టం చేశారు.

## మణికొండ--నెక్నాంపూర్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు పరిష్కరించాలి

### ది సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షులు బొమ్ము ఉపేంద్రనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి షేక్ ఆరిఫ్‌మహమ్మద్‌లు

గండిపేట(క్రైం మిర్రర్): రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను పరిష్కరించి ప్రయాణాన్ని సుగమం చేయాలని ది సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షులు బొమ్ము ఉపేంద్రనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి షేక్ ఆరిఫ్‌మహమ్మద్‌లు కోరారు. ఈ మేరకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మణికొండ--నెక్నాంపూర్ ప్రాంతాలలోని ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగిపోయిందన్నారు. సాయిరామ్‌కాలనీ, లాలమ్మ గార్డెన్స్ జంక్షన్, ఆంధ్రబ్యాంక్ జంక్షన్, బీఆర్‌సీ జంక్షన్, మర్రిచెట్టు రోడ్, బటర్ ఫ్లై సర్కిల్, నెక్నాంపూర్, అల్కాపూర్ టౌన్‌షిప్ మెయిన్ రోడ్డు, ఎంజీ పార్క్ జంక్షన్, రోడ్ నెంబర్ 25, 27 ద్వారా మణికొండ నెక్నాంపూర్ మార్గంలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందన్నారు. ఈ ప్రాంతాలు ఇప్పటికే వేగంగా జరుగుతున్న పట్టణీకరణ, వాహణాల అధిక సంఖ్య, రహదారి వెడల్పు పరిమితుల వల్ల ఒత్తిడిలో ఉన్నాయన్నారు. దీనికి తోడు బార్లు, రెస్టారెంట్లు, వైన్ షాపులు, ఇతర అధిక రద్దీ కలిగించే వాణిజ్య కార్యకలాపాల స్థాపన వలన వాహనాల రాకపోకలు పెరగడం, అక్రమ పార్కింగ్, జనసమ్మర్థం పెరగడం జరుగుతూ ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమవుతుందన్నారు. వెంటనే ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని కోరారు.

## ప్రజా పాలనలో ఆర్.టి.సి కార్మిక సంఘాలకు గుర్తింపు లేదు...ప్రశ్నించే హక్కు లేదు...?

### ఆర్ టి సి కార్మికులు ఆత్మహత్యలు వద్దు పోరాడి హక్కులను సాధించుకుందాం

### ఆర్ టి సి సమ్మెపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి చర్చలు సఫలం చేయాలి.

### ఆర్ టి సి నీ ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికుల న్యాయమైన డిమండ్స్ పై సీఎం రేవంత్ రెడ్డి స్పందించకపోతే పోరాటం ఉధృతం చేస్తాం

### ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్ హెచ్చరిక

### ఆర్.టి.సి కార్మికుల సమ్మెకు ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా సమితి సంపూర్ణ మద్దతు.



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** కాంగ్రెస్ ప్రజా పాలనలో ఆర్ టి సి కార్మిక సంఘాలకు గుర్తింపు లేదు. ప్రశ్నించే హక్కు లేదు అన్ని ఆర్ టి సి కార్మికులు ఆత్మహత్యలు వద్దు పోరాడి హక్కులను సాధించుకుందామని ఆర్ టి సి సమ్మెపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి చర్చలు సఫలం చేయాలనీ ఆర్.టి.సి కార్మికుల సమ్మెకు ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా సమితి సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఆర్.టి.సి నీ ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికుల న్యాయమైన డిమండ్స్ పై సీఎం రేవంత్ రెడ్డి స్పందించకపోతే పోరాటం ఉధృతం చేస్తాం అన్ని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్ హెచ్చరించారు. స్థానిక ఖమ్మం డిపో దగ్గర మూడోరోజు జరుగుతున్న ఆర్ టి సి కార్మికుల సమ్మెకు గత మూడు రోజుల నుండి చేస్తున్న సమ్మెకి ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా సమితి సంపూర్ణ మద్దతు తెలుపుతు సమ్మెలో ధర్నాలో పాల్గొనడం జరిగింది ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్ మద్దతు తెలిపి మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ కేసీఆర్ ప్రభుత్వం ఆర్ టి సి నీ ప్రైవేట్ కి అప్పజెప్పాలని చూసి కార్మికుల సమస్యలను విస్మరించి సమ్మెను విచ్చినం చేసి కార్మిక సంఘాల గుర్తింపును రద్దు చేసి నియంత పాలన చేసిందని, నేడు మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వం అలానే చేయాలని చూస్తే చూస్తూ ఊరుకునేది లేదని వెంటనే ఆర్ టి సి సమ్మెపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించి కార్మికుల న్యాయమైన డిమండ్స్ ను పరిష్కరించాలని లేకపోతే పోరాటం ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## ప్రజల శ్రేయస్సే కాంగ్రెస్ లక్ష్యం

### రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

**గండిపేట(క్రైం మిర్రర్):** తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల శ్రేయస్సు కోసం ఎంతో కృషి చేస్తుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించి జీవో ఇచ్చిన సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాటేదాన్, శివరాంపల్లిలోని ఆర్యవైశ్య కుల పెద్దలు, యువకులు అందరు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ చైర్మన్ సోమ శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధనుంజయ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు రంగా ప్రభాకర్‌గుప్తా, సరాబు అనంతంగుప్తా, సిరంగి బుచ్చయ్యగుప్తా, భద్రయ్యగుప్తా, గుడిపల్లి శేఖర్‌గుప్తా, కొండా కృష్ణయ్యగుప్తా, సోమ అశోక్‌గుప్తా, పూరి శ్రీనివాస్‌గుప్తా, పి.శేఖర్‌గుప్తా, ఓరగంటి మల్లేష్‌గుప్తా, వై.విజయకుమార్‌గుప్తా, కే.పుల్లయ్యగుప్తా, సంపత్‌గుప్తా, సోమ సందీప్‌గుప్తా, వి.సత్యనారాయణగుప్తా, వై.బాలరాజ్‌గుప్తా, వలకొండ విజయ్ కుమార్ గుప్తా, నేలేటి నరసింహ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



## మట్టి మాఫియా మాయాజాలం.. వందల టిప్పర్లతో అక్రమ దందా..

### టిప్పర్లపై పట్టాలు లేవు.. నిబంధన అసలే లేదు

### రోడ్ల వెంట దుమ్ము దూళి..పట్టించుకోని అధికార యంత్రాంగం

**సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 24(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ప్రభుత్వం నుంచి నామమాత్రపు అనుమతులు పొంది, వందలాది టిప్పర్ల మట్టిని మునుగోడు,చండూర్ పరిసర ప్రాంతాల్లోని ఇటుక బట్టీలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం టిప్పర్లపై తార్పాలిన్ కట్టాలి, నిర్ణీత సమయాల్లోనే రవాణా చేయాలి. కానీ ఇక్కడ అవేవీ అమలు కావడం లేదు. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ల నుండి మట్టి రోడ్లపై పడుతుండటంతో వెనుక వచ్చే ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా సాయంత్రం 6 గంటల తర్వాత కూడా యథేచ్ఛగా వాహనాలు నడుపుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. రోడ్ల వెంట ఉన్న కరెంటు వైర్లను కూడా తెంపి అడ్డగోలుగా వెళ్లడం జరుగుతుంది.నారాయణపురం నుండి మునుగోడు పరిసర ప్రాంతాల్లో వెళ్లే రహదారి పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. నిత్యం వందలాది భారీ టిప్పర్లు తిరుగుతుండటంతో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. ఎగిసిపడుతున్న దుమ్ము కారణంగా స్థానికులు శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మట్టి మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న టిప్పర్లను సీజ్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# ప్రతి ఇంటికి తాగునీటిని అందించడమే లక్ష్యం

## రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్.. రూ.1.84 కోట్లతో మంచినీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన





**గండిపేట(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని ప్రజల తాగునీటి కష్టాలను తీర్చడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం అత్తాపూర్ సర్కిల్ కాటేదాన్ సెక్షన్ మైలార్‌దేవ్‌పల్లి వార్డు--117 పరిధిలోని దుర్గా వెంచర్ ప్రాంతంలో కొత్త మంచినీటి పైపులైన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశబూరు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై?ల అండ్ సీవరేజ్ బోర్డు(హెచ్ఎండబ్ల్యు?యఎస్ఎస్‌బీ) ఆధ్వర్యంలో రూ.1.84 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులు చేపట్టారు. అయ్యప్ప టెంపుల్ సమీపంలోని వివిధ గహ సముదాయాలకు ప్రయోజనం చేకూర్చేలా 200ఎంఎం, 150ఎంఎం, 100ఎంఎం దయా కలిగిన వాటర్ సప్లై?ల లైన్లను ఇక్కడ ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి శుద్ధి చేసిన మంచినీటిని అందించడమే తమ లక్ష్యమన్నారు. ఈ పైపులైన్ పనులు పూర్తయితే కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి పరిసర ప్రాంతాల్లో నీటి ఎద్దడి శాశ్వతంగా తొలగిపోతుందన్నారు. పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రేమ్ దాస్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు ధనంజయ్, ఎల్లప్ప, మసున వెంకటేష్ నేత, ప్రేమ్ గౌడ్, గట్టయ్య, కళ్లెం లక్ష్మారెడ్డి, యాంజల శేఖర్ నేత,నాని, స్థానిక ప్రజాప్రతినిధులు, జలమండలి అధికారులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ ఆర్టీసీ కార్మికుల డిమాండ్‌లను పరిష్కరించాలి

## కాళేశ్వరంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటి సమాధానం వచ్చింది

### మణికొండ బీఆర్ఎస్ నాయకులు



గండిపేట(క్రైం మిర్రర్): తెలంగాణ ఆర్ టీ సీ కార్మికులు 32 డిమాండ్ల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెకు కాంగ్రెస్ ప్రభుత్వం కాలాతీతం చేయడానికి వేసిన ఐ.ఏ.ఎస్ అధికారుల కమిటీ 4 వారాల గడువు కోరడం సమ్మెను నీరు గార్చడమేనని తలచి డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మ హత్యకు ప్రభుత్వమే కారణమని మణికొండ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఆరోపిచారు. ప్రభుత్వం అతని కుటుంబానికి ఎక్స్ గ్రేసియా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆత్మ శాంతికై ఒక నిమిషం మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. నాగరిత పెరుగుదలకు నీటి విలువ ప్రస్తుత తరుణంలో ఎల్ నినో కారణముగా పసిఫిక్ మహా సముద్రంలో జరుగుతున్న సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల ప్రభావంతో తాగునీరు, వ్యవసాయం రెండింటి పైనా తీవ్ర ప్రభావం పడే ప్రమాదం గురించి ఇప్పటికే భారత మెట్రోలాజికల్ డిపార్ట్మెంట్ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసిందన్నారు. రాష్ట్రంలో నీటి కొరత కనిపిస్తున్న వేళ, వేడి తరంగాలు పెరగడంతో సంక్షోభం అత్యంత ప్రమాదకర స్థాయి కెళు ందన్నారు. ఈ నేపథ్యంలో కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పై కాంగ్రెసు ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యం ప్రశ్నించాల్సిన అంశం కాగా మూడు బారేజీలు 19 రిజర్వాయర్లతో దేశంలోనే అతి పెద్ద నీటి ప్రాజెక్ట్‌గా నిలిచిన ప్రాజెక్ట్‌ను గత 2 సంవత్సరములుగా విచారణలు, కమిషన్ల పేరుతో కావాలనే పక్క త్రోవ పట్టించడం కాంగ్రెసు ఘనత అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఈ ప్రాజెక్ట్ ద్వారా తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు వస్తున్న మంచి పేరు చెడ గొట్టడమే ప్రధాన లక్ష్యంగా వ్యవహరిస్తున్న అనుమానాలు బల పడుతున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్ర అత్యుత్తమ న్యాయ వ్యవస్థ తీర్పు ప్రకారం జస్టిస్ పి సి ఘోష్ కమిషన్ 86 పియర్స్ లో కేవలం 2, 3 పియర్స్ సమస్యలను పరిష్కరించ కుండా ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేసిన విషయం కాస్తా బయట పడిందన్నారు. ఇది పరిపాలనా వైఫల్యం కాదు – రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజా వనరులను పణంగా పెట్టిన చర్యగా భావించాల్సి ఉంటుందన్నారు. ఎల్ నినో హెచ్చరికలు తీవ్రంగా ఉన్న సమయంలో మెడిగడ్డ వద్ద మరమ్మతులు చేపట్టకుండా ప్రజలను మభ్య పెట్టడానికి సందర్శనలు చేపట్టడం కాంగ్రెసు ప్రభుత్వం చేస్తున్న ద్వంద నీతికి పరాకాష్టగా ఉన్నది. తమ నిర్ణయ లోపాలతో ఎస్.ఎల్.బీ.సీ సొరంగం కూలిపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి ప్రతీక కీలకమైన నీటి మౌలిక వసతులను సంరక్షించడంలో విఫలమైన కాంగ్రెసు ప్రభుత్వం, రాజకీయ విమర్శలతో కప్పి పుచ్చే ప్రయత్నం చేస్తోందన్నారు. నీటి వనరులు లేని దేశాలు ఎంతో వ్యయ ప్రయాసలతో సముద్రపు ఉప్పునీటి నుండి లవణాలు, ఖనిజాలను తొలగించి త్రాగడానికి మారుస్తున్న తరుణంలో, నీటి సంక్షోభం వంటి అత్యవసర అంశాల్లో ప్రభుత్వం చూపాల్సిన బాధ్యతను పక్కన పెట్టి, రాజకీయ కక్ష సాధింపుల కోసం ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం అత్యంత ప్రమాదకరన్నారు. ప్రజల ప్రాణాలు, రైతుల భవిష్యత్తు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అన్నీ రాజకీయ ప్రతీకారల కోసం బలవు తున్నాయి. నీటి వనరుల సంరక్షణపై తక్షణ చర్యలు తీసుకోలేకపోతే ఇట్టి నిర్లక్ష్యానికి మూల్యం కాంగ్రెసు ప్రభుత్వం చెల్లించాల్సి వస్తుందనీ మణికొండ భారత రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ, నాయకులు కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్,బొమ్ము ఉపేంద్రనాథ్ రెడ్డి, అందే లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, యాలాల కిరణ్, భాను చందర్, విజయ లక్ష్మి, బొడ్డు శ్రీధర్, షేక్ ఆరిఫ్, సుమనళిని, బాబు రావు, రాజేంద్ర ప్రసాద్, నూకల మంజు, శ్యామలెట్ రేఖ, చెరుకూరి బాలాజీ, శ్రీనివాస్, నగేష్ తది తరులు డిమాండ్ చేస్తున్నారు.

# ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి

## డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్యకు కారణం రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి

## జేఏసీ నాయకులతో చర్చలు జరిపి సమ్మెను కాల్ ఆఫ్ చేయాలి

### సిఐటియు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జాజాల రుద్రకుమార్



**గండిపేట(క్రైం మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆర్టీసీ కార్మికుల నిరవధిక సమ్మెకు మద్దతుగా రాజేంద్రనగర్ పట్టణంలో కార్మికులకు మద్దతు తెలియజేస్తూ సిఐటియు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జాజాల రుద్రకుమార్ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత మూడు రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వము పరిష్కరించకుండా కాలయాపనం చేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు గత టీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్ల పాటు ఆర్టీసీలను మోసం చేస్తుందని ఆర్టీసీ కార్మికులకు పోరాటం చేసే హక్కు లేకుండా సంఘాలను పెట్టుకునే స్వేచ్ఛ లేకుండా ఉక్కు పాదం మోపుతూ దుర్మార్గమైన పరిపాలన కొనసాగుతుందని ఎన్నో ప్రవగల్బాలు పలికిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి ఈరోజు ఆర్టీసీ కార్మికులు పెట్రోల్ పోసుకొని దహనమై కాలిపోతుంటే పట్టించుకోకుండా కాలయాపనం చేయడం దుర్మార్గం అని అన్నారు. ఆర్టీసీ కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వాలు తెలుగు రాష్ట్రాల్లో మనుగడ సాధించలేదని గుర్తు చేశారు. కెసిఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 56 రోజుల సమ్మె ఆర్టీసీ కార్మికులు చేస్తే గాలికి వదిలేసి ఉక్కు పాదం మోపి ప్రయత్నం చేసిందని ఆ ప్రభుత్వానికి ఓడించి ఇంటికి పంపించారు ఆర్టీసీ కార్మికులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ కోసం ఎలక్ట్రిక్ బస్సులు నడపాలని చెప్పి ప్రైవేటు వ్యక్తులకు ప్రైవేటు కంపెనీలకు కార్పోరేట్ శక్తులకు అప్పజెప్పటం సరైంది కాదని ఆయా రాష్ట్రాల్లో ఆర్టీసీ కార్పొరేషన్ కు ఇచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వము ఆదేశాలు జారీ చేయాలని ప్రైవేట్ వ్యక్తులకు ఎలక్ట్రిక్ బస్సులు వెళితే ఉన్న ఆర్టీసీలో కార్మికులు ఉద్యోగుల పరిస్థితి ఏందని ప్రశ్నించారు. ఇప్పటికే ప్రభుత్వం కార్పోరేట్ శక్తులు ఆర్టీసీ ఆస్తులపై కన్ను వేసి దాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని అది దుర్మార్గం అని ఆస్తులు కాపాడుకోవడం కోసం ఆర్టీసీ కార్పొరేషన్ను ప్రభుత్వంలో విలీనం చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా కార్మికులను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. 2021 25 ఇవ్వాల్సిన పిఆర్సి బకాయిలు వెంటనే విడుదల చేసి రిటైర్మెంట్ అయినటువంటి ఉద్యోగులకు బెనిఫిట్స్ సౌకర్యం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు దిన దినాన గండంగా భావించే పరిస్థితులు దాపరిచాయని ఆర్టీసీ ఆవరణలోకి వెళితే జైల్లోకి వెళ్లే పరిస్థితి లాగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 60000 మంది ఉన్న కార్మికులు 37వేలకు కుదించబడ్డారంటే ఖాళీ అయిన పోస్టులను భర్తీ చేయకుండా ఉన్న కార్మికుల పై పని భారం పెంచుతూ ఎనిమిది గంటల పనిని 10 గంటల పని దినంగా జరుపుకుంటూ ముందుకెళ్తున్న యజమాన్యం కార్మికుల పక్షాన ఆలోచించరాన్ని ప్రశ్నించారు. ఎంతటి విర్రవీగిన ప్రభుత్వాలు ప్రజా పోరాటాలకు తలకు తప్పదని రోజురోజు పోరాటం ఉదృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ కూర్చొని వారి యొక్క డిమాండ్ల పైన పరిష్కరించి చర్చలకు పిలిచి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు లేనిచో ప్రభుత్వం పైన తిరుగుబాటు తప్పదని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎన్. జంగయ్య, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పిసికే భాస్కర్, చుక్క మోహన్, కాలే రాజు, బచ్చలకూర స్వామి, రేఖ నాయక్, చింటూ, బి వెంకటయ్య పాల్గొన్నారు.

# రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి హైకోర్టు తీర్పు గట్టి చెంపెట్టు

## నార్సింగి సర్కిల్ బీఆర్ఎస్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి

### పీసీ ఘోష్ కమిషన్ నివేధిక కాదు... అది కాంగ్రెస్ రాసిన పీసీసీ స్క్రిప్ట్



గండిపేట(క్రైం మిర్రర్): కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కోసం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కోలుకోలేని దెబ్బ అని నర్సింగ్ సర్కిల్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. విచారణ పేరుతో గత మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న రాజకీయ కక్షసాధింపులు నేటి తీర్పుతో బట్టబయలయ్యాయని ఆయన విమర్శించారు.ఈ సందర్భంగా ఆయన హైకోర్టు తీర్పులోని ప్రధానాంశాలను ప్రస్తావిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. చట్టాన్ని తుంగలో తొక్కిన సర్కార్‌సహజ న్యాయ సూత్రాలు, ప్రాథమిక హక్కులు, ఎంక్వయిరీ యాక్ట్–1952 నిబంధనలను రేవంత్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ధ్వజమెత్తారు. సెక్షన్ 8బి ప్రకారం ఎవరి ప్రతిష్టకైనా భంగం కలిగే అవకాశం ఉంటే, వారికి ముందే నోటీసు ఇచ్చి వివరణ కోరాలి. కానీ కేసీఆర్, హరీష్ రావు అధికారుల వివరణ తీసుకోకుండానే వారిపై ప్రతికూల వ్యాఖ్యలు చేయడం చట్టవిరుద్ధమని కోర్టు తేల్చిచెప్పిందని ఆయన గుర్తుచేశారు. ఇది స్వతంత్ర కమిషన్ ఇచ్చిన నివేదిక కాదు, గాంధీ భవన్ నుంచి కాంగ్రెస్ పార్టీ రాసిచ్చిన పీసీసీ స్క్రిప్ట్ అని బీఆర్ఎస్ మొదటి నుంచి చెబుతోంది. అదే నిజమని తేలింది అని విష్ణువర్ధన్ రెడ్డి ఎద్దేవా చేశారు. పిటిషనర్లకు నష్టం కలిగించేలా ఉన్న కమిషన్ లోని అంశాలన్నీ చట్టపరంగా 'ఇన్–ఆపరేటివ్' అని కోర్టు ప్రకటించడం ద్వారా ఆ నివేదికకు చట్టబద్ధత లేదని స్పష్టమైందన్నారు. కేసీఆర్ ప్రతిష్టను మసకబార్చాలని చేసిన కుట్రలు బెడిసికొట్టాయని, నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోర్టు స్టే ఇవ్వడం కాంగ్రెస్ అబద్దాల ప్రచారానికి పరాకాష్ట అని ఆయన అన్నారు. రెండు పిల్లర్లకు మరమ్మతులు చేస్తే సరిపోయే కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయ ప్రతీకారంతో మూలపడేశారని ఆయన మండిపడ్డారు. మూడేళ్లుగా తెలంగాణ రైతాంగాన్ని నిలువునా ముంచుతూ గోదావరి జలాలను పక్క రాష్ట్రానికి దోచిపెట్టే కుతంత్రం రేవంత్ రెడ్డిది అని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ కుట్రలను పక్కన పెట్టి, రాష్ట్ర రైతాంగానికి ముక్కు నేలకు రాసి క్షమాపణలు చెప్పాలి. ఏమాత్రం ఆలస్యం చేయకుండా మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులు పూర్తి చేసి సాగునీరు అందించాలి.కేవలం ప్రచార ఆర్భాటాలే కాకుండా, ప్రాజెక్టులపై చిత్తశుద్ధితో పని చేయాలి, లేదంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. న్యాయస్థానం కేసీఆర్ వాదనతో ఏకీభవించడం ద్వారా, ఇది కేవలం రాజకీయ వేధింపుల కోసం జరిగిన ప్రయత్నమే తప్ప వాస్తవాలను వెలికితీసే ప్రయత్నం కాదని నిర్ధారణ అయ్యిందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# వంత్‌రెడ్డి ప్రభుత్వానికి హైకోర్టు తీర్పు గట్టి చెంపెట్టు

## రాజేంద్రనగర్ సర్కిల్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మా రెడ్డి

**గండిపేట(క్రైం మిర్రర్):** కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కోసం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కోలుకోలేని దెబ్బ అని నర్సింగ్ సర్కిల్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. విచారణ పేరుతో గత మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న రాజకీయ కక్షసాధింపులు నేటి తీర్పుతో బట్టబయలయ్యాయని ఆయన విమర్శించారు.ఈ సందర్భంగా ఆయన హైకోర్టు తీర్పులోని ప్రధానాంశాలను ప్రస్తావిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. చట్టాన్ని తుంగలో తొక్కిన సర్కార్‌సహజ న్యాయ సూత్రాలు, ప్రాథమిక హక్కులు, ఎంక్వయిరీ యాక్ట్–1952 నిబంధనలను రేవంత్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ధ్వజమెత్తారు. సెక్షన్ 8బి ప్రకారం ఎవరి ప్రతిష్టకైనా భంగం కలిగే అవకాశం ఉంటే, వారికి ముందే నోటీసు ఇచ్చి వివరణ కోరాలి. కానీ కేసీఆర్, హరీష్ రావు అధికారుల వివరణ తీసుకోకుండానే వారిపై ప్రతికూల వ్యాఖ్యలు చేయడం చట్టవిరుద్ధమని కోర్టు తేల్చిచెప్పిందని ఆయన గుర్తుచేశారు. ఇది స్వతంత్ర కమిషన్ ఇచ్చిన నివేదిక కాదు, గాంధీ భవన్ నుంచి కాంగ్రెస్ పార్టీ రాసిచ్చిన పీసీసీ స్క్రిప్ట్ అని బీఆర్ఎస్ మొదటి నుంచి చెబుతోంది. అదే నిజమని తేలింది అని విష్ణువర్ధన్ రెడ్డి ఎద్దేవా చేశారు. పిటిషనర్లకు నష్టం కలిగించేలా ఉన్న కమిషన్ లోని అంశాలన్నీ చట్టపరంగా 'ఇన్–ఆపరేటివ్' అని కోర్టు ప్రకటించడం ద్వారా ఆ నివేదికకు చట్టబద్ధత లేదని స్పష్టమైందన్నారు. కేసీఆర్ ప్రతిష్టను మసకబార్చాలని చేసిన కుట్రలు బెడిసికొట్టాయని, నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోర్టు స్టే ఇవ్వడం కాంగ్రెస్ అబద్దాల ప్రచారానికి పరాకాష్ట అని ఆయన అన్నారు. రెండు పిల్లర్లకు మరమ్మతులు చేస్తే సరిపోయే కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయ ప్రతీకారంతో మూలపడేశారని ఆయన మండిపడ్డారు. మూడేళ్లుగా తెలంగాణ రైతాంగాన్ని నిలువునా ముంచుతూ గోదావరి జలాలను పక్క రాష్ట్రానికి దోచిపెట్టే కుతంత్రం రేవంత్ రెడ్డిది అని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ కుట్రలను పక్కన పెట్టి, రాష్ట్ర రైతాంగానికి ముక్కు నేలకు రాసి క్షమాపణలు చెప్పాలి. ఏమాత్రం ఆలస్యం చేయకుండా మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులు పూర్తి చేసి సాగునీరు అందించాలి.కేవలం ప్రచార ఆర్భాటాలే కాకుండా, ప్రాజెక్టులపై చిత్తశుద్ధితో పని చేయాలి, లేదంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. న్యాయస్థానం కేసీఆర్ వాదనతో ఏకీభవించడం ద్వారా, ఇది కేవలం రాజకీయ వేధింపుల కోసం జరిగిన ప్రయత్నమే తప్ప వాస్తవాలను వెలికితీసే ప్రయత్నం కాదని నిర్ధారణ అయ్యిందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎర్రోళ్ల యాదయ్య , నవీన్ కుమార్ , సరికొండ దుర్గేష్, గిరిబాబు, గౌతమ్, విజయ్ , యాదయ్యా, లక్కీ, నీరజ్ తదితరులు నాయకులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటాం

## రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి

**గండిపేట(క్రైం మిర్రర్):** తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులకు చేపడుతున్న సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తూ వారి పక్షాన పోరాడుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ తమ మేనిఫెస్టో ద్వారా ఎన్నికల వాగ్దానాల ఇచ్చిన హామీలు నెరవేర్చాలని గత బిఆర్ఎస్ కెసిఆర్ ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం వెంటనే ఆర్టీసీ ని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆర్టీసీ కార్మికుల న్యాయమైన కోరికలు తీర్చాలని కోరుతూ సమ్మె చేస్తున్నరు. రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి రాజేంద్రనగర్ బస్ డిపో వద్ద ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపరు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మరణించిన శంకర్ గౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించరు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వం ఆర్టీసీ మనుగడ కోసం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని జీవో ఇచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే విలీనం చేస్తామని మిగిలిన కోరికలు అన్నిటినీ తీరుస్తామని హామీ ఇచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తి అయినా కూడా కార్మికుల న్యాయమైన కోరికలు తీర్చడం లేదని నిరంకుశ పాలన చేస్తుందని దుయ్యబట్టారు. నాడు కేసీఆర్ గారి అక్కున చేర్చుకుంటే.. నేడు ఆత్మబలిదానాలా? తెలంగాణలో కార్మికుల ప్రాణాలు ఇలా చవకబారిపోయాయా? ఇందుకోసమేనా పోరాడి తెలంగాణ సాధించుకుంది, ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తున్నప్పటికీ,




ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఒక అమాయక ప్రాణం బలైంది. నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. 80% కాలిన గాయాలతో ఎంజీఎంలో చికిత్స పొందుతూ, తరువాత హైదరాబాద్ నిమ్స్‌కు తరలించగా, చివరకు ప్రాణాలు కోల్పోయాడన్నారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి మోసం చేసిన ప్రభుత్వం 40 రోజుల ముందే నోటీసు ఇచ్చినా స్పందించని నిర్లక్ష్యపు ప్రభుత్వం కార్మికుల కష్టాలను పట్టించుకోని క్రూర వైఖరి రేవంత్ రెడ్డిది ఈ మృతికి పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని కార్తీక్ రెడ్డి అన్నారు. ప్రజల కోసం పని చేసే ఆర్టీసీ కార్మికులను ఇంతలా నిర్లక్ష్యం చేయడం దారుణం అన్నారు. వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వారి ప్రాణాలతో ఆడుకుంటోందన్నారు. శంకర్ గౌడ్ కుటుంబానికి తక్షణ న్యాయం చేయాలి అని కార్తీక్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడుస్తున్నా ప్రస్తుత ప్రభుత్వం ఆ బిల్లును ఆమోదింపజేయడంలో గానీ, తమ మ్యానిఫెస్టోలో ఇచ్చిన విలీనం హామీని నెరవేర్చడంలో గానీ పూర్తిగా విఫలమైందన్నారు. నాడు కేసీఆర్ చూపిన ఆత్మీయత నేడు కరువైందన్నారు. అధికారుల వేధింపులో లేక హామీల అమలులో జాప్యమో తెలియదు కానీ నేడు కార్మికులు పెట్రోల్ పోసుకునే స్థాయికి వెళ్లడం బాధాకరం అని కార్తీక్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ కురుమ, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి, రమేష్ ముదిరాజ్, మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు గుమ్మడి కుమార్, సులేమాన్ డివిజన్ అధ్యక్షులు జహీర్ ఖాన్, శాస్త్రిపురం డివిజన్ అధ్యక్షులు ముక్రం ఖాన్, పి.జయప్రకాష్, ప్రేమ్ గౌడ్, మైసిరెడ్డి , మైలార్ దేవ్ పల్లి డివిజన్ యూత్ అధ్యక్షులు అక్కెం రఘుయాదవ్ , సరికొండ దుర్గేష్, శీలం తిరుపతి రెడ్డి, మజ్జిగ నరేష్ యాదవ్, యాదయ్య , సింహాద్రి, ఎస్. అశోక్ కుమార్ , శ్రీను ముకేశ్ విద్యార్థి విభాగ నాయకులు మధు, గౌతం, నవీన్‌నాయకులు,కార్యకర్తలు, ఆర్టీసీ యూనియన్ నాయకులు, ఆర్టీసీ కార్మికులు తదితరులు ఉన్నారు.



## నూతన ఎస్సై లక్ష్మీనారాయణని సన్మానించిన మాజీ సర్పంచ్ నర్సింహా రెడ్డి

**క్రైమ్ మిర్రర్,ఆత్మకూరు(ఎం) ఏప్రిల్ 24:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన ఎన్ లక్ష్మీనారాయణని మర్యాద పూర్వకంగా కలిసిన మాజీ జవాన్ పల్లెర్ల గ్రామ మాజీ సర్పంచ్ నాయిని నర్సింహా రెడ్డి అనంతరం వారిని శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అంబోజు నాగయ్య, లోడి రాజేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా నిర్మించిన వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభించిన సింగరేణి డైరెక్టర్ సతీమణి కె విజయలక్ష్మి




**మందమర్రి ఏప్రిల్ 24 క్రైమ్ మిర్రర్:** మందమర్రి ఏరియాలోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో నూతనంగా నిర్మించిన వాకింగ్ ట్రాక్‌ను సుమారు రూ.12 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన ట్రాక్‌ను శుక్రవారం సింగరేణి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ కె.వెంకటేశ్వర్లు సతీమణి కె.విజయలక్ష్మి వెంకటేశ్వర్లు, సేవా సమితి అధ్యక్షురాలు ఎన్. శ్రీవాణి రాధాకృష్ణ, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఈ వాకింగ్ ట్రాక్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం సింగరేణి యాజమాన్యం ఈ సదుపాయాన్ని కల్పించిందని తెలిపారు. వ్యాయామం, నడక ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వం లభిస్తుందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జిఎం జి.ఎల్ ప్రసాద్, ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ ఎన్ రవి, డీజీఎం పర్సనల్ సిహెచ్.అశోక్, సూపర్ ఇంటెండెంట్ ఇంజనీర్ సివిల్ ఎస్. శ్రీధర్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, సింగరేణి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడలో మానవ హక్కులపై అవగాహన కార్యక్రమం

### జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన జాతీయ అధ్యక్షుడు డా. మంగళపల్లి హుస్సేన్

**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, ఏప్రిల్ 24:** మిర్యాలగూడ మండలంలో మానవ హక్కులపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. హ్యూమన్ రైట్స్ మండల అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంగళపల్లి హుస్సేన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మండల కమిటీ సభ్యుల నియామకాలను ప్రకటిస్తూ పత్రిక ప్రకటన ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. మండల ప్రెసిడెంట్‌గా శ్రావణ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా సుందరయ్య, జనరల్ సెక్రటరీగా గణేష్, జాయింట్ సెక్రటరీగా హనుమంతు, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా లింగయ్య, కమిటీ సభ్యుడిగా సైదయ్యలను నియమించారు.కార్యక్రమంలో డాక్టర్ మంగళపల్లి హుస్సేన్ మాట్లాడుతూ మానవ హక్కుల చట్టాలు, రాజ్యాంగ హక్కులు, పౌరుల విధులు, మహిళా రక్షణ చట్టాలు, వినియోగదారుల హక్కులు, విద్య హక్కు చట్టం వంటి అంశాలపై వివరించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా కమిటీ సభ్యులు కుంభం మహేష్ కుమార్ గౌడ్, మహంకాళి మల్లేష్, జోగు శ్రీనివాస్, నర్కుటి రామరాజు, చిలుకూరు మండల అధ్యక్షుడు గోపిచంద్, కోదాడ నియోజకవర్గానికి చెందిన కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.




## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ను కోరిన మునుగోడు సర్పంచ్



### కొనుగోలు కేంద్రం సందర్శించిన సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహా గౌడ్

### కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారి

మునుగోడు క్రైమ్ మిర్రర్ ఏప్రిల్ 24 : మునుగోడు మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాని సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహా గౌడ్ శుక్రవారం ఉదయం సందర్శించారు..ధాన్యం కొనుగోళ్లపై రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు..ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని,రైతులను ఇబ్బందులు పెట్టకుండా చూడాలని సంబంధిత అధికారులకు చరవాణి ద్వారా మాట్లాడి సూచించారు.కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. మునుగోడుకు వచ్చిన జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ కు ధాన్యం కొనుగోలుపై సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహా గౌడ్ వివరించారు..రైతులను ఇబ్బందులు పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు..స్పందించిన కలెక్టర్ వాహనాలను ఎక్కువగా ఏర్పాటు చేసి నిర్లక్ష్యం చేయకుండా కొనుగోలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు..ఆర్డీఓ వందన శ్రీదేవి, ఎంపిడిఓ యుగంధర్ రెడ్డి,తహశీల్దార్ నరేష్,వ్యవసాయశాఖ అధికారులు,సెక్రెటరీ రాజశేఖర్ రెడ్డి,రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు..

## చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించిన సర్పంచ్ రమాదేవి



**మునుగోడు క్రైమ్ మిర్రర్:** మునుగోడు మండల కేంద్రంలోని 2.3. అంగన్వాడి కేంద్రంలో పోషణ అభియాన్ లో భాగంగా అక్షరాభ్యాసం కార్యక్రమం మరియు ప్రీస్కూల్ పిల్లలకు వారి యొక్క అభివృద్ధి నైపుణ్యాలను గుర్తించి స్కూల్ కార్డులో స్టార్స్ ఇవ్వడం జరిగింది ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అంగన్వాడీ టీచర్స్ పద్మ.లక్ష్మి. ఆయాలు ఆశ వర్కర్లు పిల్లల తల్లిదండ్రులు హాజరయ్యారు.






## ఆర్టీసీ కార్మికుల ధర్నాకు రాజకీయ నేతల సంఘీభావం

### డ్రైవర్ శంకర్ గౌడ్ త్యాగం వృథా కాకూడదు -- నేతల డిమాండ్

మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, ఏప్రిల్ 24: రాష్ట్రంలో కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మె సందర్భంగా ప్రాణత్యాగం చేసిన డ్రైవర్ శంకర్ గౌడ్ ఆశయ సాధన కోసం మిర్యాలగూడ ఆర్టీసీ డిపో--జాక్ ఆధ్వర్యంలో డిపో ముందు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్ రావు, తిప్పన విజయసింహారెడ్డి, సిపిఎం నాయకుడు డి. మల్లేష్, సిపిఐ నాయకుడు బంటు వెంకటేశ్వర్లు, ఎంసీపీఐయు నాయకుడు వస్కుల మట్టయ్య తదితరులు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. సమ్మె నేపథ్యంలో ప్రాణత్యాగం చేసిన శంకర్ గౌడ్ త్యాగం వృథా కాకూడదని అన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని, తక్షణమే చర్చలు జరిపి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.కార్మికుల హక్కుల సాధన వరకు తమ మద్దతు కొనసాగుతుందని, కార్మికులకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి, ధనావత్ చిట్టిబాబు నాయక్, ఎండి. మోహ్సిన్ ఆలి, ఎం.డి. ఇలియాస్ ఖాన్, ఎం.డి. మగ్దుంపాషా, ఎం.డి. మాజీద్, పద్మశెట్టి కోటేశ్వరరావు, గడ్డం దీపిక విజయ్, వింజం శ్రీధర్, లావూరి సుధాకర్, తీరంశెట్టి కోటేశ్వరరావు, గంగుల బిక్షం యాదవ్, సందేశి అంజన్ రాజు, ఎర్రమళ్ళ దినేష్, వడ్డేపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల విగ్రహ ఆవిష్కరణ మహోత్సవంలో పాల్గొన్న యువ శౌర్య సేన

**(క్రైమ్ మిర్రర్): శంకర్ పల్లి :** ఫతేపూర్ గ్రామంలో శుక్రవారం మహనీయుల విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిర్వాహకులు ధర్మన్న గారి వెంకటరెడ్డి హాజరయ్యారు. అదేవిధంగా యువ శౌర్య సేన ఫౌండర్ రవీందర్ లంటు యాదవ్ తన బృంద సభ్యులు గంగాధర్ తదితరులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ, "సమానత్వాన్ని రాజ్యాంగం మనకు ఇచ్చింది. చట్టం అనే ఆయుధంతో పేదోడికి అండగా నిలబడాలి. కుల వివక్షలతో కుళ్లిపోవాలా? మత విభేదాల మంటల్లో మాడిపోవాలా? లేక మహనీయుల బాటలో నడిచి దేశాన్ని నిర్మించాలా?" అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మర్రిగూడలో గాడి తప్పిన లాఅండ్ ఆర్డర్.!?



## పోలీస్ స్టేషన్ లో న్యాయం కరువు..బాధితులపై జులుం..!
## లాఅండ్ఆర్డర్ అస్తవ్యస్తం..వరుస దొంగతనాలు, హత్యాయత్నాలతో ప్రజలు గగ్గోలు..!
## బాధితులకు ఫుడ్ బిల్లుల హుకుం.. పేకాట శిబిరాలే లక్ష్యంగా వసూళ్ల పర్వం..!?

**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణగా నిలవాల్సిన ఖాకీ కవచం.. నేడు మర్రిగూడ మండలంలో కాసుల వేటలో పడి, కాలం వెళ్లదీస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో గత కొంతకాలంగా శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించడమే కాకుండా, పోలీసు వ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసం సడలుతోంది. వరుస దొంగతనాలు, హత్యాయత్నాలు, అక్రమ దందాలతో మర్రిగూడ మండలం ప్రస్తుతం అట్టుడుకుతోంది. వీటన్నింటికీ స్థానిక సబ్-ఇన్ స్పెక్టర్ పనితీరు, నిర్లక్ష్యమే ప్రధాన కారణమని స్థానికులు బాహాటంగానే ఆరోపిస్తున్నారు.

**డ్యూటీకి 'రామ్ రామ్'.. హైదరాబాద్ కు 'సలామ్'!**

మర్రిగూడ మండల కేంద్రంలో రాత్రి గంట కొట్టిందంటే చాలు, ఎస్ఐ తన సొంత పనుల నిమిత్తం, హైదరాబాద్ బాట పడుతున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి.! రాత్రి సమయాల్లో స్టేషన్ లో బాధ్యత కలిగిన అధికారి లేకపోవడంతో, నేరగాళ్లకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. రాజపేట తండాలో జరిగిన హత్యాయత్నం ఘటన సమయంలో, ఎస్ఐ అందుబాటులో లేకపోవడమే దాడులకు ఆస్కారం ఇచ్చిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో పెట్రోలింగ్, అవగాహన, నిఘా వ్యవస్థ నీరుగారిపోవడంతో వాహన ప్రమాదాలు కూడా గణనీయంగా పెరిగాయి..

- పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదు చేయడానికి వచ్చే బాధితులను ఆదరించాల్సింది పోయి, వారిపైనే జులుం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు తీవ్రమవుతున్నాయి.! ఓ మహిళా సమస్యపై ఫిర్యాదు వస్తే, సదరు వ్యక్తులను పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వాల్సింది పోయి, తెరవెనుక పేమెంట్ డీల్స్ నడిపినట్లు ప్రచారం జరుగుతోంది.! స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులకు స్థానిక హోటల్ లో, పెండింగ్ లో ఉన్న ఫుడ్ బిల్లులు కట్టి రావాలని, హుకుం జారీ చేయడం అధికారుల నైతిక స్థితికి అద్దం పడుతోంది.!
- మండలంలో పేకాట స్థావరాలపై దాడులు చేయడం, కేవలం వసూళ్ల కోసమేననే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.! పేకాట ఆడుతూ పట్టుబడిన



వ్యక్తుల మొబైల్ ఫోన్లు, బ్యాంక్ ఖాతాలను తనిఖీ చేసి, అందులో ఉన్న సొమ్మును సైతం తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారనే వార్తలు పోలీసు శాఖ ప్రతిష్టను మంటగలుపుతున్నాయి. దీనికి తోడు అక్రమ ఇసుక రవాణా, మట్టి మాఫియా జోరుగా సాగుతున్నా..? మామూళ్ల మత్తులో అధికారులు కన్నెత్తి చూడటం లేదనే వాదన బలంగా విన్నపడుతుంది..!

- మర్రిగూడ ఎస్ఐ అసమర్థతకు లెంకలపల్లిలో జరిగిన ఘటనే నిదర్శనమని చెప్పుకోవచ్చు..! స్థానిక పోలీస్ అధికారి లాఅండ్ఆర్డర్ ను నియంత్రించలేక చేతులెత్తేయడంతో, మరో సంఘటనలో పక్కనే ఉన్న చండూర్ ఎస్ఐ పరిస్థితిని చక్కదిద్దాల్సిన దుస్థితి ఏర్పడింది.! ఇది మర్రిగూడ పోలీసుల వైఫల్యానికి పరాకాష్టగా నిలిచింది.
- కుధాభక్ష్పల్లి హత్యాయత్నం కేసులో ఎస్ఐ పాత్ర సందేహాస్పదంగా ఉందని, నిందితులకు కొమ్ముకాస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.! భీమనపల్లిలో అక్రమ కోళ్ల ఫారాల నిర్మాణాలపై, నిరసన తెలిపిన సామాన్య ప్రజలపైనే కేసులు నమోదు చేయడం, వెంకెపల్లి తండాలో బాధితుల పక్షాన నిలబడిన వారిపై కేసులు చెయ్యడం ఏంటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. మండలంలో గుడిసె దగ్ధం



వంటి సున్నితమైన కేసులలో, నెలల తరబడి జాప్యం చేయడం వెనుక ఉన్న అంతర్యమేమిటనే, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులే రిసార్టులు, గెస్ట్ హౌస్ లలో కాలక్షేపం చేస్తూ, బాధ్యతలను గాలికొదిలేస్తే సామాన్యుడికి దిక్కెవరు? ఫిర్యాదుదారులను మీ పనికిమాలిన కేసులు చూడటానికే నేను ఉన్నానా? అని దూషించడం ఏ రకమైన పోలీసింగ్ అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గంజాయి, పేకాట వంటి సామాజిక రుగ్మతలపై రాష్ట్ర వ్యాప్తంగా, పోలీసు శాఖ యుద్ధం ప్రకటిస్తే, మర్రిగూడలో మాత్రం దానికి విరుద్ధంగా వ్యవహరించడం శోచనీయం. ?వెంటనే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, మర్రిగూడలో నెలకొన్న ఈ అస్తవ్యస్త పరిస్థితులపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మండలంలో పౌర భద్రతను పునరుద్ధరించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.




# మహేశ్వరం ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపిన అందేల శ్రీరాములు

## ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి --- అందెల డిమాండ్

**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ గత రెండు రోజులుగా కొనసాగిస్తున్న సమ్మెలో భాగంగా శుక్రవారం మహేశ్వరంలో ఆర్టీసీ కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మెకు మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు మహేశ్వరం మండల కేంద్రం బస్ డిపోకు చేరుకొని ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా నిలిచారు. అనంతరం శ్రీరాములు ఆర్టీసీ కార్మికులతో కలిసి ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు కోల్పోయిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కారణంగా కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని...ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే ప్రజా రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు...కావున ప్రభుత్వం ఆలస్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకుని ఆర్టీసీ



కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి అని....వారు కోరిన న్యాయమైన డిమాండ్లను వెంటనే తీర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు టి యాదిష్ జాతీయ కిసాన్ మోర్చా నాయకులు పాపయ్య గౌడ్ జిల్లా నాయకులు మిద్దె సుదర్శన్ రెడ్డి, పార్లమెంట్ కో-కన్వీనర్ అనంతయ్య గౌడ్,బిజెపి రాష్ట్ర నాయకులు కడారి జంగయ్య యాదవ్, పోతర్ల సుదర్శన్ యాదవ్, బిజెపి సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్,రుద్ర నాగరాజ్, గిరిజన మూర్చ రాష్ట్ర నాయకులు దేశ్యా నాయక్, మండల ప్రధాన కార్యదర్శి వనంపల్లి శ్రవణ్, ఉపాధ్యక్షులు నేనావత్ రూప్ సింగ్, కాసాని ఆనంద్ గౌడ్, కంది శీను, మోర్చా అధ్యక్షులు పాండు, రఘువీర్, సర్పంచ్ కృష్ణ యాదవ్, మాజీ సర్పంచ్ సురేష్, పాండు నాయక్, చిన్నం జంగయ్య, మహేందర్, సందుల గణేష్, లోకేష్ చంద్రకాంత్, వెంకట్, మాజీ కౌన్సిలర్లు కాంటెకర్ మధుమోహన్, రాజమోని రాజు ముదిరాజ్, జపాల సుధాకర్, బాకీ విలాస్, శ్రీను, రవి నాయక్, ముఖేష్ ముదిరాజ్, సిద్దాల శ్రీనివాస్, నితిన్ రెడ్డి, జెడి పవన్, ఎమ్మార్పీఎస్ నాయకులు,వివిధ మోర్చాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్ టి సి కార్మికుల ప్రాణాలు కోల్పోతున్నా సమస్యలు పరిష్కరించని రాష్ట్ర ప్రభుత్వం..?



## ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలి..!
## ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి దత్తు నాయక్ డిమాండ్

**మహేశ్వరం ప్రతినిధి ( క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం డిపో వద్ద ఆర్టీసీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు మద్దతుగా ఏఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దత్తు నాయక్, ఏఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు కొమ్మగల రాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత మూడు రోజుల నుండి మండుటెండలో సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు అందరికీ విప్లవి వందనాలు తెలియజేస్తూ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య పట్ల విచారణ వ్యక్తం చేశారు. ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి డిమాండ్లను నెరవేర్చుకుందామని సూచించారు. ఇకనైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల డిమాండ్లన్నింటిని ఒప్పుకోవాలని. తద్వారా సమ్మెకు ముగింపు పలకాలని సూచించారు. అదేవిధంగా మహేశ్వరం డిపో సమ్మె చేస్తున్న కార్మికులకు తక్షణం టెంటు వేసుకుని అనుమతిని పోలీస్ శాఖ ప్రభుత్వ అధికారులు జోక్యం చేసుకొని వారికి అనుమతి ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకత్వం అధికారులకు కోరడం జరిగింది. ఎండలో సమ్మె చేస్తున్న కార్మికులు అస్తవ్యస్తకు గురైన ఐలయ్య దేశలను ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవడం జరిగింది. ప్రభుత్వం వెంటనే కార్మికుల నాయకులతో చర్చలు జరిపి ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని ఆర్టీసీ కార్మికులకు భరోసా ఇవ్వాలని ప్రభుత్వానికి విన్నవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కొమగల రాజు దేవేంద్ర గౌడ్ గణేష్, పెయింటిష్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# ముమ్మరంగా కొనసాగుతున్న ఎక్సైజ్ దాడులు

## 1.944 కిలోల నల్లబెల్లం స్వాధీనం
## దాడిలో పాల్గొన్న డిటిఎఫ్ సిఐ కరుణశ్రీ

**క్రైమ్ మిర్రర్ పాలేరు :** నేలకొండపల్లి కోనాయగూడెం సమీపంలోని తండా ప్రాంతంలో నల్లబెల్లం అక్రమ రవాణా జరుగుతోందన్న విశ్వసనీయ సమాచారం మేరకు నేలకొండపల్లి సిబ్బందితో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించారు. నెలకొండపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని శంకర్‌గిరి తండా, కోనాయగూడెం ప్రాంతాల్లో ఐడీ మరియు బెల్లం నిల్వలపై తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో ఒక నల్లబెల్లం కేసును గుర్తించి, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. కోనాయగూడెం గ్రామానికి చెందిన బొమ్మిశెట్టి శ్రీనివాస్ తన ఇంట్లో అక్రమంగా నల్లబెల్లాన్ని తయారు చేసి గుడుంబా తయారీదారులకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి, 1,944 కిలోల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో ఏఈఎస్ వేణుగోపాల్ రెడ్డి, డిటిఎఫ్ సీఐ కరుణశ్రీ, నేలకొండపల్లి ఎక్సైజ్ స్టేషన్ సీఐ రమేష్, ఎస్సై లతతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. అక్రమ మద్యం తయారీకి సహకరించే వారిపై, నల్లబెల్లం నిల్వలు, రవాణా మరియు విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

# ప్రజాపాలన ప్రత్యేక కార్యక్రమాలు అమలు

## 10 థీమ్ లపై శాఖల వారీగా కార్యక్రమాలు
## డ్రగ్స్ అడ్డుకట్టకు పిల్లలు, యువతలో చైతన్యం

హైదరాబాద్: ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా 10 థీమ్ లతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో విస్తృత స్థాయిలో కార్యక్రమాలు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలను ఆయా కార్యక్రమాల్లో భాగస్వాములను చేసి, థీమ్ ల పట్ల అవగాహన కల్పిస్తున్నారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో ఇప్పటివరకు పరిశుభ్రత-ఫైళ్ల పరిష్కారం, ఆరోగ్యం, అరైవ్- అలైవ్ కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. ఈ నెల 26 వరకు సంక్షేమం పై కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 27 నుండి మే నెల 2 వ తేదీ వరకు పిల్లల భద్రత లో భాగంగా డ్రగ్స్ కు అడ్డుకట్ట వేయుటకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై విద్యార్థులు, యువత, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. మే 4 నుంచి 10 వరకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, రెవెన్యూ, విద్యుత్, నీటి పారుదల అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అభివృద్ధికి విద్య దిక్సూచిగా నిలుస్తుందనే సంకల్పంతో మే నెల 11 నుంచి 16 వరకు విద్య యొక్క ప్రాధాన్యత, ప్రామాణిక విద్యను అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పై విద్యార్థులు, తల్లిదండ్రులను చైతన్య వంతం చేస్తారు. ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో యువత కీలకపాత్ర పోషిస్తుంది. అందులో భాగంగా క్రీడలకు ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతుల ను ఎలా సద్వినియోగం చేసుకోవాలో స్పష్టం చేసేందుకు మే 18 నుంచి 23 వరకు క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే మే 25 నుంచి 30 వరకు రాష్ట్రంలో ఒక కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయుటకు చేపట్టిన పథకాలపై కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూన్ 1 నుంచి 12 వరకు పర్యావరణం థీమ్ పై కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని , అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచుటకు ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమనీ ను ప్రభుత్వం నిర్వహిస్తున్నది.

# ఉత్తర తెలంగాణలో ఎండల తీవ్రత

## 4.3 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ పగటి ఉష్ణోగ్రత

కరీంనగర్: ఉత్తర తెలంగా భగ్గుమంటోంది. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా 44.3 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ పగటి ఉష్ణోగ్రత శుక్రవారం పెద్దపల్లి జిల్లా అకెనపల్లిలో రికార్డయింది. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్‌లో 44.1, కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం వెదురుగట్టులో 43.8, రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లిలో 43.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాగల అయిదు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల స్థాయిలోనే నమోదవుతాయని, కనిష్ఠంగా రాత్రి ఉష్ణోగ్రతలు 29-30 డిగ్రీలకు పెరుగుతాయని జగిత్యాల పరిశోధనకేంద్రం శాస్త్రవేత్త బి.శ్రీలక్ష్మి తెలిపారు. గాలిలో తేమ ఉదయం 30-50 శాతం, మధ్యాహ్నం 10-15 శాతం వరకు ఉంటుందన్నారు. రాష్ట్రంలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి వర్షం కురిసే అవకాశముందని చెప్పారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.